RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 112 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం,అక్టోబర్,22,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 112 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday,October,22,2025 | PAGES : 8 RS : 4 /- |


## పోలీస్ అంటేనే సమాజానికి...
# ఒక నమ్మకం, భరోసా





- విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- నిజామబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** పోలీస్ అంటేనే సమా జానికి ఒక న మ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వ హణలో ఒక్కో సారి ప్రాణాలను సైతం పణంగా పె ట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎంద రో ఉన్నారని గుర్తు చేశా రు. హైదరా బాద్ గోషామహాల్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినో త్సవం సంద ర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పో లీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమ రవీరులకు సీఎం నివాళులు అర్పించా రు.విధినిర్వహణలో దేశం కోసం ప్రా ణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమ ని సీఎం వ్యాఖ్యా నించారు. ఆ బాధ్య తతోనే దేశవ్యాప్త ంగా ప్రతీ సంవత్స రం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమర వీరుల సం స్మరణదినోత్సవం'గా ఘనంగా నిర్వ హించు కుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వ హణలో వీర మరణం పొందిన పోలీ సు అమరవీ రులకు శ్రద్ధాంజలి ఘటి స్తున్నట్లు పే ర్కొన్నారు. శాంతి భద్రత లను కాపా డటంలోపోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవం త్‌రెడ్డి అన్నారు.విధి నిర్వ హణలో వీర మరణం పొందిన పోలీ సులకు శ్ర ద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భం గా 'అమరులు వారు' పుస్త కాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతి ని డీజీపీ శివధర్‌కు అందించా రు. అమరులైన పోలీసు కుటుంబా లకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవ ల చనిపో యిన ప్రమోద్ కుటుం బాని కి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుం బాలకు ఇంటి స్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగా ల్లో మన పోలీసులు దేశంలో నే అగ్రస్థా నంలోఉన్నారు. అసాంఘిక కార్యక లా పాలు జరగకుండా పోలీసులు అడ్డుకు ంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరా డేందుకు ఈగల్ పేరు తోబృందాలను నియమించాం. ఇటీ వలఅనేక మంది మావోయిస్టులు పోలీసులఎదుట లొంగి పోయారు.జనజీవనస్రవంతిలో కలవా లని మిగతా మావోయిస్టుల నూ కోరు తున్నానని సీఎం తెలిపారు.







## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు.. ముగిసిన నామినేషన్ల గడువు

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువుముగి సింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్య ర్థులు నామినేషన్లుదాఖలు చేశారు. 150కిపైగా నామినేష న్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100మార్క్‌ని దా టింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నా మినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజే శారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్‌అధికారి సాయిరాం పరిశీలించనున్నారు.

## భారత పర్యటనకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు..
### - ఈ ఏడాది చివరిలో పర్యటన ఖరారు..!



ఢిల్లీ,:భారత్–ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబ ంధాలలో మరో కీలకమైన ముందడు గు పడనుంది. ఈ సంవత్సరం చివరిలో ఇ జ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెత న్యాహు భారత్ పర్యటనకు రావడం ఖా యంగా కనిపిస్తోంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని అంతర్జాతీ య విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. చైనా, భారత్, రష్యా వంటి దేశాలపై టారిఫ్‌ల పేరుతో ఒత్తిడి పెం చుతున్నా రు. మరోవైపు హమాస్‌తో యుద్ధం కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు
# శ్రీరాముడే స్ఫూర్తి



- ఆయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో మోడీ ప్రస్తావన

న్యూఢిల్లీ, : దీపావళి పర్వదినాన్ని పుర స్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశా రు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరే షన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహ ల్గాంలో జరిగిన ఉగ్ర దాడికి ప్రతీకా రం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మిం చిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎ దుర్కొనే ధైర్యాన్ని ఇస్తా డు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమ ంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేక మందిని మనం ఇటీవల చూశాం అని పే ర్కొన్నారు. ఇది దేశా నికి ఇదిఒక గొప్ప విజయం అని పేర్కొన్నా రు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీ వల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.




## హైదరాబాద్‌ను గాలికి
# వదిలేసిన రేవంత్

### బస్తీ దవాఖానల్లో అందుబాటులో లేని మందు గోళీలు : కేటీఆర్

హైదరాబాద్, తెలంగాణ దిశ : రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొది లేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వి మర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవ డంలేదని మండిపడ్డారు. పార్టీ నాయకులతో కలిసి ఖైర తాబాద్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సం దర్భంగా బస్తీ దవాఖాన లో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరా లపనితీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివ రాల ను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తమకు4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయ ంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మ హిళా డాక్టర్ తెలిపారు. అంగ న్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడు తూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు.



## ప్రజల ఆశీర్వాదంతో మాగంటి సునీతమ్మ
# భారీ విజయం తథ్యం




### - ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి
### - అంబేద్కర్ నగర్ లో మాగంటి సునీతమ్మ గారి ప్రచారం
### - పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

**జూబ్లీహిల్స్, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి సునీతమ్మ భారీ విజయం సాధిస్తారని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం భాగంగా సోమాజిగూడ డివిజన్ అంబేద్కర్ నగర్ లో నిర్వహించిన ఉప ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తో కలిసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మా రెడ్డి, తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ పదేండ్లలో జూబ్లీహిల్స్ లో గోపన్న చేసిన అభివృద్ధి కనిపిస్తుంది.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పెద్దవాళ్లతో (ధనవంతులతో) బేరసరాల కొరకు పేదవాళ్ళ ఇల్లు కూల్చుతున్నారని, పేదవాళ్ళని నిద్రపోనియడం లేదని వారు ఉండడానికి ఇల్లు లేకుండా హైడ్రో పేరుతో కూలగోడుతూ బతకనివ్వడం లేదని,కాంగ్రెస్ ని ఈ ఎన్నికల్లో ఓడిస్తే, హైడ్రా అనేది పేదవారి వద్దకు దరిచేరదని,మాగంటి సునీతమ్మను గెలిస్తే ప్రభుత్వం కళ్ళు తెరిచి పేదల జోలికి వెళ్ళదని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఈ ప్రచారంలో మాజీ కార్పొరేటర్లు శేఖర్, ప్రభుదాస్, దేవేందర్ రెడ్డి, నాయకులు అప్పు ఖాన్, ప్రదీప్ చౌదరి, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి బూత్ అధ్యక్షులు, ఇంచార్జీలు, కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకాపురి అభివృద్ధికి కృషి




**చర్లపల్లి, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ ద్వారకాపురి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ ప్రెసిడెంట్ నాగ శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి ని శాలువాతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల నిర్మాణం వీధి దీపాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ద్వారకాపురి కాలనీలో ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కానీ అతను చేసిన ప్రతినిధుల వెలితిపై స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కాలనీ అభివృద్ధికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ద్వారకాపురి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని త్వరలోనే ఆ పనులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అతి త్వరలోనే ఇతర సమస్యలు కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య (%జజూ%) ప్రెసిడెంట్ ఏంపల్లి పద్మా రెడ్డి, ద్వారకాపురి కాలనీ ప్రెసిడెంట్ నాగ శివ శంకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎస్ వి నాయుడు, వైస్ ప్రెసిడెంట్ చంద్రకళ, జనరల్ సెక్రెటరీ సాయిరాం రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీధర్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రవణ్, ట్రెజరర్ నవిత, అడ్వైజర్లు యాదగిరి చార్యులు, శ్రీరాములు, సోమనాథ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీధర్ రెడ్డి, గోపాల్, సుబ్బయ్య, సూర్య రావు, సురేందర్రావు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్ అభివృద్ధికి కృషి

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ ఇందిరానగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాలనీలో జరిగిన ఎన్నికలలో గెలుపొందిన అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అధ్యక్షులు బివి. నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఘనంగా సన్మానించారు అనంతరం స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల నిర్మాణం, తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య (సిసిఎస్) అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, ఇందిరానగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి కాటేపల్లి శివారెడ్డి, ఉపాధ్యక్షులు పివి వెంకట కృష్ణారెడ్డి, ఎంబీవి రమణ నాయక్, సంయుక్త కార్యదర్శులు ఎన్ వెంకట్రావు, టి వెంకటేష్, కోశాధికారి అన్న బోయిన వెంకటేష్, కాలనీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సీఎం రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ప్రధాన కార్యదర్శిగా

### - అమరేందర్ రెడ్డి ఎన్నిక




**హైదరాబాద్, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ప్రధాన కార్యదర్శిగానేవూరి అమరేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ హాల్ లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 114 బార్ అసోసి యేషన్లతో తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ "తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్" ఏర్పడింది. ఈ ఎన్నికలను తెలంగాణ హైకోర్టుబార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎ. రవీంద్రారెడ్డి ఎన్నికల అధికారిగా విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొని నూతనంగా ఎన్నికైన ఫెడరేషన్ బృందాన్ని అభినందించారు.

# కుషాయిగూడలో విద్యుత్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్



విద్యుత్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం బస్తి బాట పట్టారు. కుషాయిగూడ ఏఈ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కాలనీలలోపలు విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా చెట్ల కొమ్మలను తొలగించి వేశారు. ప్రజలు ఏవైనా సమ స్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏఈ కోరారు. సిసిఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి పాల్గొన్నారు.

(కుషాయిగూడ, తెలంగాణ దిశ)

# పరికె చెరువు కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

### - కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం126వ డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఉన్న పరికె చెరువు కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును కబ్జా చేసే వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు, హైడ్రా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా చెరువు చుట్టూ కంచ వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రషీద్, కృష్ణ గౌడ్, లక్ష్మ రెడ్డి, గోరె భాయ్, నరేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రయ్య , బేకు శ్రీనివాస్, పండరి, సోమన్న శ్రీధర్ రెడ్డి, ఎం.డి. జాకీర్,సంతోష్, ఎం.డి. లాయక్, పెరిక శివ, భరత్ గౌడ్, వేణు గౌడ్, పిల్లి ఆంజనేయులు, మహిళా నాయకులు కౌసల్య, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద జన్మదిన వేడుకలు




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ, విప్ కెపి.వివేకానంద్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ రావు, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, హుజూర్ నగర్ ఇంచార్జి ఓ. నర్సింహా రెడ్డి హాజరై వివేకానంద్ కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమావాస్య అన్న ప్రసాద వితరణ



**కుషాయిగూడ, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడ మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజు నిర్వహించే అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంగళవారం కుషాయిగూడ శ్రీ పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా మిత్రమండలి సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షులు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరుగంటి ఆంజనేయులు (హనుమంతు), కోశాధికారి మచ్చ బాబు గౌడ్, సభ్యులు కాసుల సురేష్ గౌడ్, గుంటి ఆంజనేయులు యాదవ్, గురుమంచి వేణు చారి, పరమేష్, పంజాల సంజయ్ గౌడ్, గోపాల కృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి
# కాంగ్రెస్ నేతలు దీపావళి శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి, టిపిసిసి జనరల్ సెక్రెటరీ పీసరి మహిపాల్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- (మేడ్చల్ జిల్లా ప్రతినిధి, తెలంగాణ దిశ)

# కాలబైరవ స్వామికి ఉప్పల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



అమావాస్య సందర్భంగా ఉప్పల్ భగాయత్ లోని కాల భైరవ స్వామి దేవాలయంలో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆకాల భైరవ స్వామి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- (ఉప్పల్, తెలంగాణ దిశ)

## మూడు ఫీట్లు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న
# చర్యలు తీసుకోరా..!?

### ఆదిభట్ల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం...



**ఆదిభట్ల, అక్టోబర్ 21, (తెలంగాణ దిశ) :** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర కలాన్ లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా మూడు ఫీట్లు పక్క ప్లాట్ ను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాకి మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మూడు ఫీట్లు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని మున్సిపల్ కమిషనర్ కు సెప్టెంబర్ 11న ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంతో తిరిగి అక్టోబర్ 16వ తేదీన మరో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తమ ప్లాటు పక్కనే పండాల విజయ రాజులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, వారి ఇంటి నిర్మాణంలో భాగంగా అక్రమంగా మా బెస్మెంట్ లోపలికి మూడు ఫీట్లు ఆక్రమించి నిర్మిస్తున్నారని చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకున్నప్పటికీ లాభం లేకుండా పోయిందని ఆవేదనవ్యక్తం చేశారు. ఈ విషయంలో మున్సిపల్ ఉన్నతాధికారులు జోక్యం కల్పించుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

# సంపాదకీయం

## ఇజ్జత్ తీసుకుంటున్న ట్రంప్

2024లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. దీంతో అమెరికన్ల పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడినట్లయింది. పాలన పిచ్చోడి చేతిలోకి చేరింది. ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాడో తెలియడం లేదు. అమెరికా ఫస్ట్ అంటూ వారికి మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తున్నాడు. అమెరికన్ల ఉద్యగాలు భారతీయులు కొట్టేస్తున్నారన్న అక్కసుతో మొదట భారతీయులను ఉద్యోగాల్లోకి తీసుకోవద్దని కంపెనీలకు హుకూం జారీ చేశారు. తాజాగా హెచ్1బీ వీసాల చార్జీలు లక్ష డాలర్లకు పెంచాడు. మరుసటి రోజే ఈ రూల్ కొత్తవారికే అని సవరించాడు. తాజాగా హెచ్1బీ లాటరీ విధానంలోనూ మార్పు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఈ కొత్త ప్రతిపాదనలు ఉన్నత నైపుణ్యం ఉన్న విదేశీ నిపుణుల ఎంపికకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, స్థానిక అమెరికన్ ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూపొందుతున్నాయి. ఈ సంస్కరణలు లాటరీ విధానాన్ని సమూలంగా మార్చడం, వేతన స్థాయి ఆధారంగా దరఖాస్తులను వర్గీకరించడం వంటి కీలక అంశాలను కలిగి ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ప్రస్తుత లాటరీ విధానాన్ని తొలగించి, ఉన్నత నైపుణ్యం గల విదేశీ నిపుణులను ఆకర్షించేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ కొత్త విధానం కింద దరఖాస్తుదారుల వేతన స్థాయిని ఆధారంగా చేసుకుని నాలుగు వర్గాలుగా (లెవల్1 నుంచి లెవల్4) విభజించి, ఉన్నత వేతనం పొందే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ చర్య ద్వారా అమెరికన్ ఉద్యోగులకు పోటీని తగ్గించి, అధిక నైపుణ్యం గల విదేశీయులను మాత్రమే ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త నిబంధనలు 2026 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తే, హెచ్1బీ ఉద్యోగులకు చెల్లించే వేతన వ్యయాలు గణనీయంగా పెరుగుతాయని డీహెచ్‌ఎస్ అంచనా వేసింది. 2026లో ఈ వ్యయం 502 మిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆ తర్వాత 2027లో 1 బిలియన్ డాలర్లు, 2028లో 1.5 బిలియన్ డాలర్లు, 2029లో 2 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ పెరుగుదల అమెరికా ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా టెక్నాలజీ, ఇంజనీరింగ్ రంగాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ఈ సంస్కరణలను 2026 నుంచి అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందుతున్నాయి. అయితే, ఈ మార్పులు అమల్లోకి రావడానికి ముందు ఫెడరల్ రిజిస్ట్రార్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడం, రాజకీయ, ఆర్థిక సవాళ్లను అధిగమించడం అవసరం. ముఖ్యంగా, ఈ సంస్కరణలు అమెరికన్ కంపెనీలు, విదేశీ నిపుణుల ఆకర్షణపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది కీలక చర్చనీయాంశంగా ఉంది. హెచ్1బీ వీసా సంస్కరణలు అమెరికా ఆర్థిక వ్యవస్థలో నైపుణ్యం ఆధారిత ఉద్యోగాలను మెరుగుపరచడం, స్థానిక ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ మార్పులు అమలు చేయడంలో వేతన వ్యయాల పెరుగుదల, కంపెనీలపై ఆర్థిక భారం, విదేశీ నిపుణుల ఆకర్షణలో సమతుల్యతను కాపాడటం కీలకం. ఈ ప్రతిపాదనలు విజయవంతంగా అమలైతే, అమెరికా శ్రామిక శక్తిలో నైపుణ్యం ఆధారిత మార్పులకు బాటలు వేయవచ్చు. మరో వైపు మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సెప్టెంబర్ 19, 2025న హెచ్1బీ వీసాలకు ఏడాదికి లక్ష డాలర్ల ఫీజు విధించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇది ముఖ్యంగా టెక్ రంగంలోని భారతీయ రఐటీ కంపెనీలపై దెబ్బ తీసింది. అయితే, 24 గంటల్లోనే వైట్ హౌస్ ప్రకటన విడుదల చేసి, ఈ ఫీజు కేవలం కొత్త అప్లికేషన్లకు మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే ఉన్న వీసాలు లేదా రెన్యూవల్స్‌కు కాదని వివరించింది. తర్వాత ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. ఈ మార్పు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వంటి కంపెనీలు అమెరికాలో ఆధారంగా ఉన్న హెచ్1బీ ప్రోగ్రామ్‌పై ఆధారపడటం వల్ల వచ్చిందని అంచనా. టీసీఎస్ 2025లో 5 వేలకి పైగా హెచ్1బీ వీసాలు పొందింది, ఇది అమెరికన్ టెక్ జాయింట్స్‌తో పోటీ పడుతున్నది. ట్రంప్ హెచ్1బీ వీసా చార్జీల నిర్ణయం తర్వాత, టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా, 46 బిలియన్ డాలర్ల విలువైన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌ల కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇది 10 లక్షల మందికి ఉద్యోగాలు సృష్టించేదని అంచనా. రద్దుకు మూడు కారణాలు చూపింది. మొదటిది సేఫ్టీజూన్ 2025లో జరిగిన బోయింగ్ 787 ప్రమాదం (అహ్మదాబా ద్‌లో 240 మంది మరణాలు) తర్వాత డ్రైమ్‌లైనర్‌ల సురక్షితతపై సందేహాలు పెరిగాయి. రెండోది క్వాలిటీ బోయింగ్‌లో డీఐఈ (డైవర్సిటీ, ఈక్వాలిటీ, ఇంక్లూజన్) పాలసీలు క్వాలిటీని దెబ్బతీస్తున్నాయని టాటా వాదన. మూడోది జియోపాలిటిక్స్ ట్రంప్ 50% టారిఫ్‌లు విధించడం, అమెరికా వ్యాపారం భారత్‌కు లాభదాయకం కాదని. ఇది అమెరికాకు పెద్ద దెబ్బ, ఎందుకంటే ఇతర కంపెనీలు కూడా ఇదే కారణాలు చెప్పి ఒప్పందాలు రద్దు చేయవచ్చు. ఇదే సమయంలో అమెరికాలోని అమెజాన్, గూగుల్, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు హెచ్1బీ మార్పుకు వ్యతిరేకంగా స్పందించాయి. అమెజాన్ 10 వేలకుపైగా హెచ్1బీ వీసాలు పొందిన అగ్రస్థానంలో ఉంది. ఈ కంపెనీలు ఉద్యోగులకు 'సెప్టెంబర్ 21 ముందు అమెరికాకు తిరిగి వచ్చేయండి' అని మెమోలు జారీ చేశాయి, లేకపోతే రీఎంట్రీ డినైల్ అవుతుందని హెచ్చరించాయి. వాటి భారతీయ ఉద్యోగులు దేశం వదిలేసి భారత్‌లోనే జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్) పెట్టుకుంటామని హానికర పరిణామాలు హెచ్చరించాయి. ఇది ట్రంప్‌కు దిగిరాక తప్పలేదు, ఎందుకంటే ఈ కంపెనీలు అమెరికా ఎకానమికు కీలకంట్రంప్‌లు భారత్‌తో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయాలని ఆహ్వానించినప్పటికీ, పీయూష్ గోయల్‌ను పంపకుండా కేంద్రం అతడినే పంపింది. తాత్కాలికంగా భారత్‌కు దెబ్బ తగినప్పటికీ, దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం. భారత్ ఏ1ఆపై ఆధారపడకుండా ఆత్మనిర్భర్‌గా మారుతోంది, ఇది ట్రంప్ పునరాలోచనకు కారణం. ఆత్మనిర్భర్ భారత్ చొరవలో భారత్ స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తోంది. డీఆర్డీవో 'ప్రాజెక్ట్ కుశా' (ఎస్500 లెవెల్ ఎయిర్ డిఫెన్స్) అభివృద్ధి చేస్తోంది, 2028 నాటికి డెప్లాయ్ అవుతుంది. డ్రోన్స్.. భార్గవాస్త్ర (స్వార్మ్ డ్రోన్ న్యూట్రలైజేషన్) 2025లో టెస్ట్ అవ్వగా, డీ4అంటీడ్రోన్ సిస్టమ్ పాకిస్తాన్ కాన్ఫ్లిక్ట్‌లో విజయవంతమైంది. యాంటీడ్రోన్ టెక్, లేజర్ వెపన్స్ టీపీసీఆర్2025లో భాగం. సబ్‌మెరైన్స్: 80% ఇండిజినస్ టెక్‌తో అభివృద్ధి. ఎలక్ట్రో మాగ్నటిక్ ఏర్‌క్రాఫ్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఏఎల్) యుద్ధ నౌకలకు. శాటిలైట్ టెక్‌తో అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తోంది. ఇవి అమెరికా ఆంక్షలు విధిస్తే అమెరికాకే తీవ్ర నష్టం కలిగిస్తాయి. ట్రంప్ హెచ్1బీ మార్పు భారతఅమెరికా సంబంధాల్లో ఒక మలుపు తిరిగింది, కానీ ఇది భారత్ ఆత్మనిర్భరతను వేగవంతం చేస్తోంది. టాటా రద్దుటెక్ హెచ్చరికలు అమెరికా ఎకానమికు హెచ్చరిక. దీర్ఘకాలంలో, భారత్ స్వయం సమద్ధి ద్వారా అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తుంది, ట్రంప్ పునరాలోచనలకు దారి తీస్తుంది.

# వెనుకబడ్డ విద్యార్థులకు వెన్నుదన్నుగా




చదువు మధ్యలో ఆపేసిన పిల్లలను అక్కున చేర్చుకుని వారు చదువు లో ముందుకు వెళ్లటానికి చేయూత నందిస్తున్నారు ఈ ఆర్టీసీ కండక్టర్. పేద దళిత కుటుంబం నుంచి కష్టనష్టాలను ఎదుర్కొన్న ఆమె ఇప్పుడు తన లాంటి పిల్లలు ఆపదలో ఉన్నారని తెలిస్తే వెం టనే స్పందిస్తారు. చదువు మధ్యలో ఆపేయటం మంచిది కాదనీ, కొనసాగించటం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహి స్తామని నచ్చజెప్పి, నడిపిస్తున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారు. ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తారు. ఆమే మేడికొండ చంటి. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం సీతాయలంక గ్రామానికి చెందిన మేడికొండ సత్యం, నాంచారమ్మ దంపతుల కుమార్తె మేడికొండ చంటి. ప్రస్తుతం ఆర్టీసీ అవనిగడ్డ డిపో పరిధిలో అవనిగడ్డ–మచిలీ పట్నం రూట్‌లో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎంకాం వరకూ చదివారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే– పేద పిల్లలకు ఉచితంగా విద్యాబోధనచేస్తున్నారు. చదువు మధ్యలోఆపేసిన పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి చదువుకునేలా ఒప్పిస్తారు. తాను విధుల్లో ఉన్న బస్సులో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఒక క్రమపద్ధతి లో ఉండేలా చూసుకుంటారు. పిల్లలతో చదువుకు సంబంధించిన విషయాలు మాట్లాడి, వారిని ప్రోత్సహిస్తా రు. అవసరమైన వారికి దన్నుగా నిలిచి, దారి చూపిస్తారు. చాలా సున్నితంగా జీవన, సబ్జెక్టు నైపుణ్యాలు బోధిస్తుంటారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునోచుకోక పడుతున్న ఇబ్బం దులు చెప్పినప్పుడు ఆమె .. పరీక్షల్లో ఆ పిల్లల ఉత్తీర్ణత బాధ్యతను సైతం తీసుకుంటారు. సెలవు రోజుల్లో, తీరిక సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

చదువు మధ్యలో ఆగిపోకుండా: పేదరికం కారణంగా చదువుకు ఎవ్వరూ దూరం కాకూడదని చంటి భావన. గత 19 సంవత్సరాలు గా ఇదే విషయమై కృషిని చేస్తున్నారు. ఆమె వద్ద శిక్షణ పొందిన పిల్లలు నేడు ఇంటర్, డిగ్రీ, పిజిలను పూర్తిచేసిన వారూ ఉన్నారు. మరికొందరు వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. జువ్వలపాలేనికి చెందిన బి.నరేష్ 8వ తరగతిలో డ్రాపౌట్. ఆమె ఇచ్చిన తర్ఫీదుతో పదో తరగతి, ఆతర్వాత డిప్లమో పూర్తిచేసి ప్రస్తుతం సివిల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. బి.హిమబిందు టెన్త్ మేథ్స్‌లో ఫెయిల్. చంటి మార్గదర్శనంలో ఇప్పుడు ఎం.ఫార్మశీ పూర్తిచేశారు. జువ్వలపాలెంలోని ఎలిమెంటరీ స్కూలులో ఇంగ్లీషు సబ్జెక్టులో పిల్లలు బాగా వెనుకబడి ఉన్నారని గమనించి 15 రోజులపాటు చంటి ఇచ్చిన శిక్షణతో వారి నిపుణత పెరిగింది. రోజారాణి, తిరుపతమ్మ అనే విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. భట్టిప్రోలు సమీపం లోని కోళ్లపాలేనికి చెందిన ఎ.సాయి టెన్త్ ఫెయిలై అవనిగడ్డలో మేనమామ ఇంట్లో ఉంటూ పొలం పనులకు వెళ్తున్నాడు. అతడితో మాట్లాడి పరీక్షలు రాయించగా టెన్త్, ఐటిఐ పూర్తిచేసి ప్రస్తుతం డిఆర్‌డిఒలో పనిచేస్తున్నాడు. మాధురి, మహిమ కూడా టెన్త్ పాసయ్యే ందుకు దోహదపడ్డారు. ప్రశాంత్ టెన్త్ సోషల్ ఫెయిల్ నుంచి ఉత్తీర్ణత సాధించి మొవ్వ ఒకేషనల్ కాలేజీలో ఇంటర్‌లో 800కుపైగా మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానం పొందారు. స్పందన మేథ్స్‌లో 14మార్కులతో ఫెయిలవ్వ గా, చంటి వద్ద శిక్షణ పొందిన తర్వాత 67 మార్కులు వచ్చాయి. ప్రియచందన, సౌమ్య కూడా మంచిగా రాణిస్తున్నారు. స్ఫూర్తి, డేవిడ్ మేథ్స్‌లో తిరిగి పాసయ్యారు. కార్తీక్, ప్రణీత్ నాలుగు సబ్జెక్టుల వెనుకబాటుతో ఉన్నవారు పాసయ్యారు. ఇంటర్ ఫెయిలైన జి.నాగచైతన్యకు 67 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం డిగ్రీ చదువుతు న్నాడు. తన గ్రామంలోని బిసి బాలుర వసతిగృహంలోనూ చంటి మేథ్స్, సోషల్ చెప్పారు.

సామాజిక సేవల్లోనూ: దేశ నాయకుల వర్థంతులు, జయంతులు, స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ డే సందర్భాల్లో ఆమె 1 నుంచి పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకుఏటేటా పుస్తకాలు,ప్యాడ్లు అందజేస్తుం టారు. అవనిగడ్డ–మచిలీపట్నంలో లక్ష్మీపురం వద్ద బస్సు ఎక్కి మోపిదేవి గుడి వద్దకు బిక్షాటన చేయటానికి 14 ఏళ్లలోపు పిల్లలు ఆది, సోమవారాల్లో ఎక్కువగా బస్సు ఎక్కుతుంటారు. వారితో మాట్లాడి మార్పు కోసం ప్రయత్నిస్తూనే ఉంటారు. చల్లపల్లి, విజయవాడ, మొవ్వలోని అనాథ, వికలాంగ, మానసిక వికలాంగుల కేంద్రాలను ఆమె తన కుమారుడు, తన పుట్టినరోజులతోపాటుగా ఇతర పండుగలు, ప్రత్యేక రోజుల్లో వెళ్తారు. అక్కడి పిల్లలకు నెలకు సరిగా వివిధ రకాల సరుకులు, అల్పాహారం వంటివి అందజేస్తుంటారు.

ఆమె జీవితం కన్నీటి కడగండ్లే: చంటికి ఇంత తపన ఎందుకంటే– ఆమె కూడా అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. కుటుంబంలో ముగ్గురూ ఆడపిల్లలే. చంటి ఆఖరి అమ్మాయి. కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లే వారు. వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ జరిగేది. చంటి కూడా ఓ వైపు చదువుకుంటూనే సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్లేది. తాను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు తల్లిదండ్రులు చనిపోవటంతో అక్కలు, మేనమామ వివాహం చేశారు. మూడేళ్లు గడిచాక 2003–04లో పదో తరగతి పరీక్షలు నేరుగా రాసి, 421 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. 2006 నుంచి తీరిక వేళల్లో గ్రామంలోని పేద పిల్లలు, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారికి ఉచితంగా చదువు చెప్పటం ప్రారంభించారు. తర్వాత ఓ ప్రయివేటు కళాశాలలో క్లర్క్‌గా పనిచేశారు. లెక్కలు, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ఉన్న ఇష్టంతో వాటిని సాధన చేస్తూ, ప్రావీణ్యం పెంచుకున్నారు. ఆర్టీసీ కండక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ రాగా, ఎంపికై 2008లో ఉద్యోగ బాధ్యతల్లోకి వచ్చారు. 2012లో పోస్టల్ విభాగంలో ఉద్యోగానికి ఇంటర్వ్యూలు వచ్చాయి. ఆ ముందురోజే తన అత్త గారు చనిపోవట ంతో వాటికి వెళ్లలేకపోయారు.

**గ్రూప్స్‌లో గెలిచి సామాజిక సేవ చేస్తా**

**- మేడికొండ చంటి, ఆర్టీసీ కండక్టర్**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎపిపిఎస్‌సి గ్రూప్స్ పరీక్షల్లో నెగ్గి ఉన్నతాధికారిగా సమాజ సేవ చేయాలనేది నా లక్ష్యం. 2016లో గ్రూప్ 2లో స్క్రీనింగ్ వరకూ వెళ్లా. ఈసారి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నా. భవిష్యత్తులో ఖచ్చితంగా సాధిస్తాననే నమ్మకం ఉంది. పేద కుటుంబంలో నుంచి వచ్చా. ఆసాదక బాధకాలు నాకు బాగా తెలుసు. ఏకారణంతోనూ పిల్లలు చదువుకు దూరం కాకూడదని అనుకుంటాను. అందుకే సాధ్యమైనంత మేర అలాంటి వారిని చదువులో ప్రోత్సహిస్తున్నాను.

# బహుళ ధ్రువ ప్రపంచం



ఏకపక్ష విధానాలు ఇకపై సాగవని, బహుళ ధ్రువ ప్రపంచం దిశగా కలిసికట్టుగా సాగాలన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) 25వ శిఖరాగ్ర సమావేశం సందేశం ముదావహం. ఏడేళ్ల అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోడీ చైనా పర్యటన.. సరికొత్త ఆశలకు, అవకాశాలకు తెరలేపింది. చైనా, రష్యాలతో సంబంధాలను మరింత మెరుగుపరుచుకునేందుకు బాటలు వేసింది. ప్రపంచ దేశాలపై సుంకాలంటూ వాణిజ్య యుద్ధం మొదలుపెట్టిన ట్రంప్.. రష్యా నుంచి చమురు కొనుగోలుపై నానాయాగీ చేస్తూ భారత్‌పై ప్రతీకార సుంకాలు విధించడం, చైనాతో కూడా ఈ విషయంలో తెగేదాకా లాగి.. చివరకు వెనక్కితగ్గడం లాంటి అమెరికా ఏకపక్ష వైఖరులకు చెంపపెట్టు. ఆధిపత్య ధోరణులను విడనాడాలని, వివిధ దేశాల సార్వభౌమత్వాన్ని, హక్కులను పట్టించుకోకుండా ఏకపక్షంగా తీసుకునే చర్యలకు చెల్లుచీటీ పలకాలని తియాన్‌జిన్‌లో రెండు రోజులపాటు జరిగిన ఎస్‌సిఒ డిక్లరేషన్ పిలుపునివ్వడం సముచితం. ట్రంప్ పాక్‌ను ఆకాశానికెత్తుతుండగా.. పాక్ సమక్షంలోనే పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించడంతోపాటు చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం, ఇటువంటి వాటికి కుట్ర పన్నే వారిని, అమలుచేసే వారిని, మద్దతిచ్చేవారిని చట్టం ముందు నిలపాలన్న తియాన్‌జిన్ సదస్సు తీర్మానం అభినందనీయం. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని, మానవతా సంక్షోభాన్ని ఖండించడంతోపాటు పాలస్తీనాకు న్యాయమైన, సమగ్రమైన పరిష్కారం కనుగొనడమే పశ్చిమాసియాలో శాంతికి ఏకైక మార్గం. పాక్‌లో తీవ్రవాద దాడులు, ఆఫ్ఘన్‌లో జాతుల, రాజకీయ గ్రూపుల ప్రభుత్వం ఏర్పడాలన్న ఆకాంక్షసహా పలు అంశాలపై రూపొందించిన డిక్లరేషన్‌ను భారత్, చైనా, రష్యా, పాక్ సహా పది సభ్య దేశాలు ఆమోదించడం, మరో 17 దేశాలు చర్చల్లో భాగస్వాములుగా ఉండటం శుభపరిణామం. ప్రపంచ జనాభాలో 42 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తూ, 30 లక్షల కోట్ల డాలర్ల జిడిపి కలిగివున్న ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాలలోని ఈ దేశాలు ఏకతాటిపైకి రావడం, నిలబడటం ప్రపంచ ప్రయోజనాలకు అవసరం. భారత్‌కు ఎరువుల సరఫరా పునరుద్ధరణ, విలువైన ఖనిజాలు, ఉత్పత్తులపై గతంలో విధించిన ఆంక్షల ఎత్తివేత, సరిహద్దు యాజమాన్యంపై ఒప్పందం, వాణిజ్యం, వీసాలు, విమానాల రాకపోకల పునరుద్ధరణ, చైనా పెట్టుబడులకు అనుమతి, టిబెట్‌లో మానస సరోవరాన్ని భారత యాత్రికుల కోసం తెరవడం, సొరంగాలు తవ్వే యంత్రాల సరఫరా%ొ% తదితర అంశాలపై భారత్, చైనాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం ద్వైపాక్షిక పురోగతికి దోహదం చేసేదే. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా భద్రత, శాంతి, స్థిరత్వం, కీలకమని, మానవత్వానికే పెను సవాలుగా ఉన్న ఉగ్రవాదం, వేర్పాటువాదంపై ఐక్యంగా పోరాడాలని, పరస్పర మన్నన, విశ్వాసం, సున్నితత్వం ప్రాతిపదికన సంబంధాలను పెంచుకునేందుకు కట్టుబడాలన్న భారత్ పిలుపు, ఆర్థిక అభివృద్ధిపై కేంద్రీకరించి, ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని, ఇరు దేశాల సంబంధాలు మరింతగా వృద్ధి చెందాలన్న చైనా ఆకాంక్ష పరస్పర ప్రాధాన్యతలకు అద్దంపట్టేవే. ప్రచ్ఛన్నయుద్ధ మానసిక స్థితి నుంచి బయటపడాలని, అంతర్జాతీయ సంబంధాల్లో అదిరించే, బెదిరించే ఎత్తుగడలు, కూటముల ఘర్షణలు సాగవన్న జిన్‌పింగ్ ఉద్ఘాటన అమెరికాకు మింగుడుపడనిదే. మనదేశం సంయమనంతో వ్యవహరిస్తున్నా%ొ% అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చుతూ తరచూ వాచాలత్వం ప్రదర్శిస్తున్న ట్రంప్, అమెరికా వాణిజ్య సలహాదారు పీటర్ నవారో లాంటి వారిని ఈ పరిణామాలు మరింత కలవరపెట్టేవే. అమెరికా ఏకపక్ష వైఖరిని, సామ్రాజ్యవాదాన్ని ప్రతీకార సుంకాలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్న భారత్, చైనా, రష్యాల బంధం, బ్రిక్స్, ఎస్‌సిఒలు బహుళ ధ్రువ ప్రపంచానికి మార్గం సుగమం చేయడంతోపాటు ప్రపంచ శాంతికి, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం.

# ఆఫ్ఘన్‌లో ప్రకృతి ఆగ్రహం..

***ఆఫ్ఘనిస్తాన్ గత వైభవానికి, ప్రస్తుత విషాదానికి ఒక నిలువుటద్దం. ఒకప్పుడు గొప్ప నాగరికతలు వర్ధిల్లిన ఈ భూమి, గడచిన నాలుగు దశాబ్దాలుగా నిరంతర యుద్ధాలు, అంతర్గత కలహాలు, మానవతా సంక్షోభాల కబంధ హస్తాల్లో చిక్కుకుంది. ఈ మానవ నిర్మిత విలయానికి ప్రకృతి ఆగ్రహం తోడైనప్పుడు, అది ఒక భయంకరమైన విషాదానికి దారితీస్తుంది. రెండు రోజుల క్రితం ఆఫ్ఘనిస్తాన్‌లో సంభవించిన భూకంపం అలాంటిదే. రిక్టర్ స్కేల్‌పై కేవలం 6.0 తీవ్రత ఉన్నప్పటికీ, ఈ భూకంపం 800 మందికి పైగా అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంది. ఇది కేవలం ఒక ప్రకృతి వైపరీత్యం కాదు. మానవ వైఫల్యం, రాజకీయ నిర్లక్ష్యం, అంతర్జాతీయ సమాజ నిశ్శబ్ద వైఖరి కలగలిసి సృష్టించిన ఒక భయంకర విషాదం.***

కారణాలు: భూకంపాలు అన్ని దేశాల్లోనూ సంభవిస్తాయి. కానీ అవి కలిగించే విధ్వంసం ఆ యా దేశాల భౌగోళిక, మానవ నిర్మిత పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఆఫ్ఘనిస్తాన్ భూకంపాలకు నిలయంగా ఉండటానికి ప్రధాన కారణం దాని అసాధారణ భౌగోళిక స్థానం. ఈ దేశం ప్రపంచంలోనే అత్యంత క్రియాశీలక టెక్టోనిక్ ప్రాంతాలలో ఒకటైన భారత యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఉంది. ఈ ప్లేట్లు నిరంతరం ఒకదానితో ఒకటి రాపిడికి గురవుతూ, భూమి లోపల తీవ్రమైన ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. ఈ ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు, భూకంపాలు సంభవిస్తాయి. ఇది ఒక శాశ్వత భౌగోళిక సత్యం. అయితే, ఇప్పుడు సంభవించిన భూకంప ప్రత్యేకత దాని తీవ్రత కాదు. ఇది భూమి ఉపరితలం నుంచి కేవలం 8–10 కిలోమీటర్ల లోతులో సంభవించడం వల్ల, దాని శక్తి అత్యంత తీవ్రంగా ఉపరితలంపై వ్యాపించింది. లోతైన భూకంపం అయితే, దాని శక్తి భూమి లోపల కొన్ని వందల కిలోమీటర్ల వరకు విస్తరించి, ఉపరితలంపై తీవ్రత తగ్గుతుంది. కానీ ఇప్పుడు సంభవించిన భూకంప ఫోకస్ తక్కువ లోతులో ఉండటం వల్ల విధ్వంసం అనూహ్యంగా పెరిగింది. ఇది కేవలం ప్రకృతి ఆగ్రహం మాత్రమే కాదు, మానవత్వపు నిస్సహాయతను కూడా వెల్లడి చేసింది. విషాదాన్ని పెంచిన మానవ వైఫల్యం: భూకంపం ప్రకృతి వైపరీత్యం కావచ్చు, కానీ ప్రాణ నష్టం ఎక్కువగా ఉండటానికి కారణం మానవ వైఫల్యం. భూకంపాలు తరచుగా వచ్చే జపాన్, చిలీ, టర్కీ వంటి దేశాలు కూడా ఒకప్పుడు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. కానీ ఆ దేశాలు గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకొని, కఠినమైన భవన నిర్మాణ నియమావళిని అమలు చేశాయి. సాధారణ గృహాలను కూడా భూకంపాల ఒత్తిడిని తట్టుకునేలా నిర్మిస్తారు. కానీ ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళు సాధారణంగా మట్టి, మట్టి ఇటుకలతో కడతారు. ఒక చిన్న ప్రకంపనం చాలు, మొత్తం గోడలు కూలిపోయి నిద్రలో ఉన్న ప్రజలను సమాధి చేస్తాయి. ఈ బలహీనమైన నిర్మాణాలకు తోడు, పటిష్టమైన విపత్తు నిర్వహణ వ్యవస్థ లేకపోవడం%ొ%సహాయక చర్యలు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం. దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత, తీవ్రమైన ఆర్థిక క్షీణత దేశాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. 2021లో తాలిబన్లు అధికారాన్ని చేపట్టిన తర్వాత అంతర్జాతీయ సమాజంతో సంబంధాలు తెగిపోయాయి. ఫలితంగా, అత్యవసర సహాయం ఆలస్యంగా చేరుకుంది. అలాగే, కొండ ప్రాంతాలు, దుర్గమమైన రహదారులు సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకోవడానికి అడ్డంకులుగా మారాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి అత్యంత కీలకమైన మొదటి కొన్ని గంటలు వృథా అయ్యాయి,ఫలితంగా ప్రాణనష్టం ఊహించనంతగా పెరిగింది. చరిత్ర నుండి ఏం నేర్చుకున్నాం?: ఈ భూకంపాలు ఆఫ్ఘనిస్తాన్‌కు కొత్త కాదు. ఈ దేశ చరిత్రలో అనేక విధ్వంసకర భూకంపాలు సంభవించాయి. ఉదాహరణకు 1998 తఖర్ భూకంపం, 2015 హిందూ కుష్ భూకంపం, 2022 పక్టికా భూకంపం, 2023 హెరాత్ భూకంపంకూడా భారీ ప్రాణ నష్టాన్నిమిగిల్చాయి. ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు సహజ విపత్తు అనేది కేవలం ఒక అత్యవసర పరిస్థితి కాదని, అది వారి జీవితంలో ఒక నిరంతర భాగమని ఈ భూకంపాలు స్పష్టం చేశాయి. ప్రతీసారీ విషాదం సంభవించినప్పుడు ప్రపంచ దేశాలు సహాయం కోసం ముందుకు వచ్చాయి.

# సిండికేట్‌గా వైన్స్ మాఫియా?



**నిజామాబాద్,తెలంగాణ దిశ :**మద్యం షాపులను దక్కించుకునేందుకు దరఖాస్తుల సమయంలోనే సిండికేట్ గా వైన్స్ మాఫియా ఏకమవుతున్నారు. మద్యం మాఫియా డాన్లురంగ ప్రవేశం చేసి చక్రం తిప్పుతున్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం సిండికేట్ వ్యాపారులు తమ ఆర్థిక పరిపుష్టి, పలుకుబడిన ఉపయోగించి లిక్కర్ దందాను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈమేరకు మద్యం మాఫియా వైన్ వ్యాపారులతో కలిసి రహస్యంగా భేరసారాలు కుదుర్చుకునే పనిలో నిమగ్నమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా కామారెడ్డి, నిజామా బాద్, బోధన్ ఆర్మూర్,ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ప్రాంతాల్లో నడుస్తున్న వైన్ వ్యాపారాలను బేరీజు వేసుకుంటున్నారు.గడిచిన దినాల్లో ఏ ప్రాంతాల్లో అధికంగా క్రయవిక్రయాలు జరిగాయన్న విషయాన్ని పరిగణంలోకి తీసుకొని ఆయా ప్రాంతాలలోఉన్న వైన్ షాపులపై మాఫియా దృష్టి పెడుతున్నారు. లిక్కర్ అధికంగా అమ్ముడు పోయే షాపులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా షాపులు రిజర్వేషన్ ప్రకారంగా ఉంటే బినామీ పేర్లపై కూడా టెండర్ వేసి సాహసం చేసేందుకు సిద్ధ మవుతున్నారు.ఉమ్మడి జిల్లాలో గతంలో2023-2025 సంవత్సరానికి గాను మద్యం వ్యాపారులకు అధిక లాభార్జన జరిగింది. తిరిగి ప్రభుత్వం టెండర్ల కాలం ముగియ డంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వైన్ షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.26 సెప్టెంబర్ 2025 నుండి అక్టోబర్ 18వ తేదీ 2025 వరకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను చేపడుతున్నారు. తదుపరి అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిపేందుకు ఎక్సైస్ శాఖ చర్యలు చేపట్టనున్నారు.కొత్త దుకాణాలకు2025 డిసెంబర్ 1 నుండి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ధారించారు. అయితే గడిచిన టెండర్లలో టెండర్లు వేసే ప్రతి వ్యక్తి రెండు లక్షల రూపాయలు మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ దఫా ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయలు పెంచుతూ టెండర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

కొత్తగా మద్యం దుకాణాల టెండర్ కు మూడు లక్షలు: కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ఉత్సాహాన్ని చూపే వ్యాపారులు ఒక్కో వైన్ షాప్ కోసం టెండర్ ఫీజు రూ.3 లక్షలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అట్టి డబ్బు తిరిగి చెల్లించే అవకాశం ఉండదు. టెండర్ల ప్రక్రియ అనంతరం 2025 డిసెంబర్ 1 న గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు ఐదు శాతం కింద మద్యం దుకాణాలు కేటాయించే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ దఫా జరిగే టెండర్లలో పోటీ దార్ల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిక్కర్ దందాల కొనసాగుతున్న వారే కాకుండా, ఇతరులు కూడా వైన్ షాప్ ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. తమ తమ ఏరియాలలో వైన్ షాపులను దక్కించుకునేందుకు ఇతర వ్యాపారాలకు చెందిన వ్యక్తులు కూడా టెండర్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.లిక్కర్ దందాలో లాభాలు ఎక్కువగా రావడంతో వైన్ వ్యాపారంలో కొనసాగేందుకు ఉత్సాహపడుతున్నారు. ఈ మేరకు వైన్ దందాలో ఉన్నవారితో పోటీపడేందుకు సైతం సిద్ధపడుతున్నారు. 2023-25 సంవత్సరానికి గాను క్రితం జరిగిన టెండర్లలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 3579 మంది వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2025- 27 కు సంబంధించి జరిగే టెండర్లలో పోటీదారుల సంఖ్య ఇంత పెరిగే అవకాశాలు స్పష్టమవుతున్నాయి.దఫా 5000 వరకు టెండర్లు నమోదు కానున్నట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో 102 వైన్ షాపులు నడుస్తున్నాయి. వీరి ద్వారా మరో వెయ్యికి పైగా షాపులు అనధికారికంగా( బ్లాక్ షాపులు) కొనసాగుతున్నాయి. ఈసారి లిక్కర్ వ్యాపారులతో కలిసి దందా చేసిన బ్లాక్ షాప్ మద్యం వ్యాపారులు కూడా టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధహస్తులవుతున్నారు.

రిజర్వేషన్ షాపులపై దృష్టి..: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లిక్కర్ మాఫియా రిజర్వేషన్ షాపులపై కూడా దృష్టి సారించింది. గౌడ్స్, ఎస్ టి, ఎస్ సి వర్గాలకు వచ్చే షాపులను కైవసం చేసుకునేందుకు ఆయా వర్గాలకు చెందిన నిరుపేద వ్యక్తులతో టెండర్లు వేయించే ప్రయత్నం చేస్తున్నారు. వారి పేరిట షాపులను దక్కించుకొని దందాను నడుపుకునే ప్లాన్ వేస్తు న్నారు.వారికి నయానో భయానో అప్పచెప్పి వారి పేరిట వైన్ షాపును పొంది లిక్కర్ దందాల కొనసాగేందుకు అనుకూలమైన వ్యక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మద్యం సిండికేట్ మాఫియా రహస్య సమావేశాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఎక్కువగా లిక్కర్ అమ్ముడుపోయే అడ్డాలపైనే దృష్టి పెడుతున్నారు. ఆ షాపులపై ఐదు నుండి 10 వరకు వేసేందుకు సైతం రంగం సిద్ధం చేస్తున్నారు.

నిరుద్యోగులు సైతనీ..: మద్యం సిండికేట్ మాఫియా నిరుద్యోగ యువకుల పేర్లతో టెండర్లలో భాగస్వాములను చేసే వాతావరణం కనిపిస్తోంది. వారి పేరిట కూడా షాపులను చేజిక్కించుకొని దందాను పెంపొందించుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ మేరకు వారిపై కూడా ఒకటికి మించి ఐదు వరకు టెండర్ ఫారాలను వేసేందుకు తగిన పైకాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.ఉమ్మడి నిజామా బాద్,కామారెడ్డి జిల్లాలో ఈసారి జరిగే మద్యం టెండర్లలో మద్యం సిండికేట్ మాఫియా డాన్లు తమ ఉనికిని చాటుకొని పెద్ద మొత్తంలో షాపులను దక్కించుకోవడమే కాకుండా అధిక లాభాలను గడించేం దుకు ఉన్న అవకాశాలు అన్నింటిని వాడుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికా రులు సైతం లిక్కర్ మాఫియాకు ఎక్కడెక్కడ ఏ షాపులు దక్కించుకుంటే లాభాలు అర్జించవచ్చు అని విషయాలను అందజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.టెండర్ల ప్రక్రియలో ఎలాంటి మెలుకువలు పాటించా లో కూడా ఎక్సైజ్ అధికారులు తగు సూచనలు ఇస్తున్నట్లు సమాచారం. మరి ఈసారి లిక్కర్ టెండర్లు మాఫియా చేతుల్లోకి వెళ్ళిపోతాయా... కొత్తవారికి దక్కుతాయా.. లే దో. వేచి చూడాల్సిందే..

## మహిళల సమస్యలపై చొరవ చూపుతున్న లోకేష్ కు కృతజ్ఞతలు

**అమరావతి,తెలంగాణ దిశ:** విజయవాడలో ఆటోడ్రైవర్ సేవలో పథకం ప్రారంభోత్స వంలో పాల్గొనేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సుమారు 11.5 కి.మీ.లు ఆటోలో ప్రయాణించారు. ఉండవల్లి నివాసం నుంచి ప్రకాశం బ్యారేజి, విఎంసి ఆఫీసు, కాళేశ్వర రావు మార్కెట్, ఏలూరు లాకులు, సీతంపేట గేటు, సింగ్ నగర్ ఫ్లైఓవర్, డాబాకొట్లు సెంటర్ మీదుగా మాకినేని బసవపున్నయ్య స్టేడియంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత అనే మహిళకు చెందిన ఆటోలో ప్రయాణించిన లోకేష్... ఆమెతో ముచ్చటిస్తూ కుటుంబ నేపథ్యం, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల వివరాలను వాకబు చేశారు. తాము విజయవాడ ఆటోనగర్ లో నివాసం ఉంటున్నామని, మహిళను అయినప్పటికీ తన భర్త నమ్మకంతో తనను ఈ వృత్తిలో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. 2014లో నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు శిక్షణ పొందానని, బాబు గారి చేతులమీదుగానే షి ఆటోలను మాకు అందజేశారని ఆమె తెలిపింది. తమ కుమార్తె సిఎ చదువుతోందని, కుమారుడు ఆర్మీలో చేరాలని ఆసక్తిగా కనబరుస్తున్నాడని చెప్పింది. ప్రస్తుతం పెట్రోలు ఖర్చులు పోను నెలకు పదివేల వరకు సంపాదిస్తున్నానని తెలిపింది. ఎక్కువగా తమ ఆటోలో మహిళలే ప్రయాణిస్తుంటారని చెప్పింది. మహిళల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంలో మీరు చూపుతున్న చొరవకు హ్యాట్సాప్ అని లోకేష్ కు స్వర్ణలత కృతజ్ఞతలు తెలిపారు. ఆటోడ్రైవర్ సేవలో పథకం కింద ప్రభుత్వం రూ.15వేలు అందజేస్తున్నందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భార్యాభర్తలిద్దరూ చెరొక పని చేసుకుంటే కుటుంబాన్ని సాఫీగా నడపవచ్చని చెప్పిన మంత్రి లోకేష్.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు.


## ట్రాఫిక్ పోలీసులు ఆర్టీవో అధికారులు ఇబ్బందులు పెడితే మా దృష్టికి తీసుకురండి

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్,ఎమ్మెల్యే గల్లా మాధవి,నగర మేయర్ కోవెలమూడి నాని, కూటమి నాయకులు ప్రా రంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ ఆటో డ్రైవర్ ఒక కుటుంబాన్ని ఏ విధంగా సురక్షితంగా ఇంటికి చేరుస్తారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని కూడా సురక్షితంగా ముందుకు నడిపిస్తున్నారని అన్నారు.వైసీపీ ప్రభుత్వం లో 15 వేలు రూపాయలు ఇచ్చారు కానీ రోడ్లు గుంతలు మయం చేశారు. ఆ ప్రభుత్వం ఇచ్చే 15 వేలు ఆటో రిపేర్ కి సరిపోయేది కాదు. ట్రాఫిక్ పోలీసులు ఆర్టీవో అధికారులు ఇబ్బందులు పెడితే మా దృష్టికి తీసుకురండి. రాష్ట్ర బడ్జెట్ లో 60 వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్నారు. నగరంలో బ్రిడ్జి నిర్మాణాలు జరుగుతున్నాయి ట్రాఫిక్ ఇబ్బందులు రానున్న రోజుల్లో ఉండవు. ఆటో డ్రైవర్లు కు కొన్ని ప్రాంతాల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కట్టండి. గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం మధ్య వ్యత్యాసం గుర్తించండని అన్నారు.

# చార్మినార్ నీడలో గంజాయి బ్యాచ్ ఆగడాలు..

### అడ్డోస్తే దాడులు.. పోలీసన్నలు జర చూడండి..

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. గంజా తాగి.. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ రెచ్చిపోతున్నారు.హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ.. రెచ్చిపోతున్నారు. ఈ బ్యాచ్‌లు తమకు మామూలు డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేయడం, పదేపదే బెదిరించడం, రోజూ వచ్చి వసూళ్లకు పాల్పడటం సర్వసాధారణంగా



మారింది. పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల చిరు వ్యాపారులు.. ఈ గంజాయి బ్యాచ్‌ల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రోజంతా కష్టపడి అమ్మితే వచ్చేది అంతంతమాత్రమే అని, దాన్ని కూడా గంజాయి బ్యాచ్ బెదిరించి లాక్కుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి రక్షించాలని కోరుతున్నారు. చార్మినార్ ప్రాంతం ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కావడంతో అక్కడికి వచ్చే పర్యాటకులు కూడా ఈ గంజాయి బ్యాచ్‌ల వేధింపులకు గురవుతున్నారు. వారి ఎదుటే రోడ్లపై గంజాయి బ్యాచ్‌లు రౌడీలుగా ప్రవర్తించడంతోపాటు.. పలు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని.. వసూళ్ల కోసం గుంపులుగా కూర్చుంటున్నారు. దీంతో పర్యాటకులు భయంతో అక్కడ నిలబడలేకపోతున్నారు. ఇలాంటి వారితో చార్మినార్ పర్యాటక రంగం కూడా దెబ్బతింటోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనలు పర్యాటకులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా చిరు వ్యాపారులకు కూడా నష్టం తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలంటున్నారు.

## ప్రతి 5 రోజులకు ఒక కొత్త బిలియనీర్

ముంబై : భారతదేశంలో గత కొన్నేళ్లుగా ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతోంది. కొత్త పరిశ్రమలు, చాలా పెద్ద కంపెనీలు భారతదేశానికి వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోటీశ్వరులు, బిలియనీర్ల సంఖ్య కూడా అదే రీతిగా పెరుగుతోంది. సంపదలో భారతదేశంలో కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశంలో ప్రతి 30 నిమిషాలకు ఒక కొత్త కోటీశ్వరుల కుటుంబం తయారవుతోంది. బిలియనీర్ల విషయానికి వస్తే, కొత్త నివేదిక ప్రకారం ప్రతి 5 రోజులకు భారతదేశంలో ఒక కొత్త బిలియనీర్ పుట్టుకొస్తున్నాడు. ప్రతి 5 రోజులకు ఒక బిలియనీర్ పుడుతున్నప్పుడు, ఈ విషయంలో భారత్ ప్రపంచంలో ఏ స్థానంలో ఉందో ఇక్కడ తెలుసుకుందాం.మెర్సిడేస్ బెంజ్ 2025 ప్రకారం, భారతదేశంలో కోటీశ్వరులు వేగంగా పెరుగుతున్నారు. 2021లో దేశంలో 4.58 లక్షల కోటీశ్వరుల కుటుంబాలు ఉండగా, 2025 నాటికి ఈ సంఖ్య 8.71 లక్షలకు చేరింది.అంటే కేవలం 4సంవత్సరాలలో దాదాపు 90 శాతం వృద్ధి నమోదైంది. ఈ నివేదికలో మొత్తం ఆస్తి రూ.8.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న కుటుంబాన్ని కోటీశ్వరులుగా పేర్కొన్నారు. ప్రకారం, ఇప్పుడు ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్యలో భారతదేశం మూడవ స్థానానికి చేరుకుంది. చైనా, అమెరికా తర్వాత, భారతదేశం అత్యధిక బిలియనీర్లు కలిగిన దేశంగా నిలిచింది. భారతదేశంలో ప్రతి5రోజులకు ఒక కొత్త బిలియనీర్ పుట్టుకొస్తున్నాడు. ఇది ఆర్థిక వృద్ధి, స్టార్టప్‌ల విజయం, స్టాక్ మార్కెట్ వృద్ధితో పాటు సాంకేతిక రంగంఅద్భుత ఫలితాల ప్రభావం అని అభిప్రాయపడింది. భారతదేశపు కోటీశ్వరుల రాజధానిగా ముంబై నిలిచింది. ఇక్కడ 1.42లక్షల కోటీశ్వరుల ఫ్యామిలీస్ ఉన్నాయి.మనం రాష్ట్రాల విషయానికి వస్తే, మహారాష్ట్ర అగ్ర స్థానంలో ఉంది. దీని తరువాత తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక నగరాలు ఉన్నాయి. కోటీశ్వరుల సంఖ్య పెరగడానికి కారణం కొత్త టెక్నాలజీ, స్టార్టప్‌లు, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందడం కారణమని చెప్పవచ్చు.

## బ్రేకులు ఫెయిలయి కార్లను ఢీకొన్న కంటైనర్

**రంగారెడ్డి,తెలంగాణ దిశ:** బ్రెక్ ఫెయిల్ కావడంతో పక్కనే ఉన్న రహదారి రేలింగ్ ను మరో రెండు కార్లను డికొట్టి పక్కనే ఉన్న కంపౌండ్ వాల్ లోకి కంటైనర్ దూసుకెళ్లింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దిశ సంఘటనా స్థలంలో చోటు చేసుకుంది. ఘటనా స్థలంలో హోటల్స్ ఉండడంతో జనాల రాకపోకలు కొనసాగుతాయి. అయితే, కంటైనర్ ఆగిపోవడంలో పెను ప్రమాదం తప్పింది. గచ్చిబౌలి వెళ్ళేందు బస్సుల కొసం అక్కడే వేచిచూస్తున్న జనాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ప్రమాదానికి కారకుడైన కంటెనర్ డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి కంటెనర్ నడుపుతున్నాడా లేదంటే బ్రెక్ ఫేల్యూర్ కావడంతో ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# 20 ఏళ్లుగా ఆ గ్రామ ఉప సర్పంచే

**ఖమ్మం,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్ల సమస్య కారణంగా గ్రామ సర్పంచ్ పదవులు ఖాళీగా ఉంటున్నాయి. ఖమ్మం జిల్లాలోని నూకలంపాడులో ఎస్టీలకు సర్పంచ్ స్థానం కేటాయించినా.. గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీనివల్ల గత నాలుగు టర్మ్‌లుగా ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో నాలుగు గ్రామాల్లో ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేయగా, అభ్యర్థులు కరువయ్యారు. దీంతో ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయి, ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది.తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు విచిత్రమైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. రిజర్వేషన్ల కేటాయింపులో ఉన్న లోపాల కారణంగా కొన్ని గ్రామాలలో సర్పంచ్ పదవి ఖాళీగా ఉండిపోతోంది, ఫలితంగా ఆయా ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతోంది.ఖమ్మం జిల్లాలో విచిత్ర పరిస్థిత.. ఖమ్మం జిల్లా, ఏన్కూరు మండలం పరిధిలోని నూకలంపాడు గ్రామ పంచాయతీలో ఈ విచిత్రమైన పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోంది. మొత్తం 1,063 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామ పంచాయతీని షెడ్యూల్డ్ ఏరియాగా ప్రకటించారు. దీని ప్రకారం సర్పంచ్ స్థానంతో పాటు, మొత్తం ఎనిమిది వార్డుల్లో నాలుగు ఎస్టీలకు రిజర్వ్ చేశారు.

దురదృష్టవశాత్తు నూకలంపాడు పల్లెలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీని కారణంగా 2004 నుంచి ఇప్పటివరకు సర్పంచ్ పదవితో పాటు ఎస్టీలకు కేటాయించిన నాలుగు వార్డులు ఖాళీగా ఉంటున్నాయి. గత నాలుగు టర్మ్‌ల ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఈ క్రమంలో.. ఎన్నికలు జరిగిన జనరల్ వార్డుల్లో గెలిచిన సభ్యులలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకొని, ఆ ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగనుంది.నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో కూడా పరిస్థితి ఇందుకు తగిన విధంగానే ఉంది. ఈ మండలంలోని కల్ములోనిపల్లి, ప్రశాంత్‌నగర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి అనే నాలుగు గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేశారు. ఈ నాలుగు గ్రామాలలోనూ ఎస్టీ కుటుంబాలు లేకపోవడంతో, సర్పంచ్ అభ్యర్థులే కరువయ్యారు. గత ఎన్నికల్లోనూ ఇలాగే జరిగింది, ఫలితంగా ఐదేళ్లపాటు ఈ పల్లెలలో ప్రత్యేకాధికారి పాలనే కొనసాగింది. ఈసారైనా రిజర్వేషన్లు మారుతాయని ఆశించిన గ్రామస్తులకు మళ్లీ నిరాశే ఎదురైంది.

గ్రామాల అభివృద్ధికి ఆటంకం..: సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోతున్నాయని ప్రజలుఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధిలేకపోవడంతో ప్రభుత్వ నిధులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో కూడా ఎన్.వి. బంజర (బీసీ మహిళ), రాములుతండా (బీసీ జనరల్) గ్రామాల్లో బీసీ ఓటర్లు లేకపోవడంతో, అక్కడ కూడా వార్డు సభ్యుల్లో ఒకరిని ఉపసర్పంచ్‌గా నియమించి, సర్పంచ్ బాధ్యతలను అప్పగించనున్నారు. స్థానిక అధికార యంత్రాం గం స్పందించి.. ఆయా ప్రాంతాల్లోని సామాజిక వర్గాల జనాభా ప్రకారం రిజర్వేషన్లను మార్పు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దగ్గుమందులపై ఆందోళన!


జైపూర్: కలుషితమైన దగ్గు సిరప్‌ల వల్ల మధ్యప్రదేశ్‌లో 9 మంది, రాజస్థాన్‌లో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. దీంతో దేశవ్యాప్తంగా దగ్గుమందులపై ఆందోళన మొదలయ్యింది. అయితే తమ మందుల్లో విషకారకాలు లేవని సదరు ఫర్మా సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలు పాటించని మందుల కంపెనీపై చర్యలు తీసుకుంది. జైపూర్‌కి చెందిన కేసన్స్ ఫార్మా కంపెనీ తయారు చేసిన మందుల పంపిణీని ప్రభుత్వం నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ స్పందించారు. చిన్నారుల మృతుల ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని, తదనుగుణంగా వారిపై కఠినమైన చర్యల్ని తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు.

ఈ సమస్యపై విచారణకు ఆయన నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి గజేంద్ర సింగ్ కూడా విచారణకు ఆదేశించారు. ఈ కేసన్స్ ఫార్మా కంపెనీ తయారు చేసే 19 మందుల సరఫరాను తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వైద్య-ఆరోగ్య శాఖ నిలిపివేసిందని అధికారులు తెలిపారు. దీంతోపాటు డెక్స్ట్రోమెథోర్ఫాన్ కలిగిన అన్ని ఇతర దగ్గు సిరప్‌ల పంపిణీని కూడా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిలిపివేశారు. అక్రమ పద్ధతిలో ఔషధ ప్రమాణాలను నిర్ణయించే పక్రియను ప్రభావితం చేశారనే ఆరోపణలపై ఆ కంపెనీ డ్రగ్ కంట్రోలర్ రాజారామ్ శర్మను వైద్య ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలకు డెక్స్ట్రోమెథోర్ఫాన్ సిరప్ ఇవ్వకూడదని కేంద్ర ప్రభుత్వం 2021లో అడ్వైజరీ జారీ చేసిందని తాజాగా వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గాయత్రి రాథోడ్ తెలిపారు. ఇదిలా ఉండగా..

కేసన్స్ ఫార్మా కంపెనీ నాణ్యతా ప్రమాణాలను పాటించదని రాజస్థాన్ మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఎంఎస్‌సిఎల్) గతంలోనే నిర్దారించింది. 2012లో పదివేలకు పైగా కేసన్స్ ఫార్మా ఔషధాల నమూనాలను పరీక్షిస్తే.. వాటిలో 42 మందుల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించలేని ఆర్ఎంసిఎస్‌సిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పుఖ్రాజ్ సేన్ తెలిపారు.

# డిజిటల్ బుక్ లో వైసీపీపైనే ఫిర్యాదులు




**గుంటూరు,తెలంగాణ దిశ:** తెలుగుదేశం పార్టీ తమ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఎదుర్కొనేందుకు రెడ్ బుక్ తీసుకొచ్చింది. అందులో అన్నీ రాసుకుని వడ్డీతో సహా బాకీ తీర్చేస్తామని మంత్రి నారా లోకేష్ గత ఎన్నికల సమయంలో పలుమార్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ తీసుకొచ్చింది. వైసీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులను ఇందులో నమోదు చేయాలని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ లాంచ్ చేయడం తెలిసిందే.ఏపీ మాజీ మంత్రి విడదల రజనీకి వైసీపీ డిజిటల్ బుక్‌లో షాక్ తగిలింది. చిలకలూరిపేటలోని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం నాడు వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా విడదల రజినిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రావు సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ, '2022 లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ ఆఫీసుతో పాటు, నా ఇల్లు, కారుపై మాజీ మంత్రి విడదల రజినీ దాడి చేయిం చారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాల ని వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశానని' వివరించారు.డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు అనంతరం వచ్చిన టికెట్‌ను చూపించారు. తనకు కనుక జగన్ న్యాయం చేస్తే.. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఈ డిజిటల్ బుక్ యాప్ ద్వారా న్యాయం అందుతుందని నమ్మకం కలుగుతుంద న్నారు రావు సుబ్రహ్మణ్యం. ఇందులో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగు తుందని అందరికీ దీనిపై నమ్మకం కలుగుతుందని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు.వాస్తవానికి మాజీ మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన ఇంటి వద్ద, వైసీపీ నాయకులు, శ్రేణులతో కలిసి వైసీపీ డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించడం తెలిసిందే. ఇప్పుడు ఆమె మీద నియోజకవర్గం నుంచి ఫిర్యాదు రావడంతో వైసీపీ శ్రేణులు కంగుతిన్నాయి. దీనిపై వైసీపీ అధిష్టానం ఏం చర్యలు తీసుకుంటుందా అనేది ఉత్కంఠ రేపుతోంది.ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ఎదుర్కొంటున్న అన్యాయం, వేధింపులు, కక్షలు, తప్పుడు కేసులు వీటికి ఒక సమాధానం, సాక్ష్యం కావాలి అని పార్టీ అధినేత వైఎస్ జగన్ జూఖీఅఖ డిజిటల్ బుక్ ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలకు సమాధానం ఈ డిజిటల్ బుక్ ద్వారా దొరుకుతుందన్నారు. ఈ డిజిటల్ బుక్ వైసీపీ కార్యకర్తలకి జగనన్న ఇస్తున్న భరోసా, అభయం అని పేర్కొన్నారు.

# పేర్ని నానికి నో ఆప్షన్..

**విజయవాడ,తెలంగాణ దిశ :** మాజీ మంత్రి పేర్ని నాని విషయంలో జగన్ తిరిగి తన నిర్ణయం మార్చుకున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నాని ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పేర్నినాని పోటీ చేయాలని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నానికి బదులు ఆయన కుమారుడు పేర్నిసాయి కృష్ణమూర్తి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2029 ఎన్నికల్లో పేర్ని నానిని పోటీ చేయాలని ఇటీవల పేర్నినానికి గట్టిగా జగన్ చెప్పినట్లు తెలిసింది. పేర్నినాని కొంత తటపటాయించినా వచ్చే ఎన్నికలు కీలకమని, ఈసారి మాత్రం మీరే పోటీ చేయాలంటూ పేర్ని నానిని ఉద్దేశించి కొంత గట్టిగానే చెప్పినట్లు సమాచారం. దీంతో అందుకు పేర్ని నాని కూడా అంగీకరించినట్లు తెలిసింది. పేర్ని నాని తండ్రి పేర్ని కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండేవారు. ఆయన తదనంతరం రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పేర్ని నాని కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మచిలీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన



పేర్ని నాని విజయం సాధించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి జగన్ వెంటే ఉన్నారు. పేర్ని నాని 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర చేతిలో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో తిరిగి పేర్ని నాని వైసీపీ నుంచి గెలిచారు. కొల్లు రవీంద్రను ఓడించారు. తర్వాత పేర్ని నాని జగన్ మంత్రివర్గంలో సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేశారు పేర్నినాని మంచి వాగ్దాటి ఉన్న నేతగా పార్టీలో పేరుపొందారు. కాపు సామాజికవర్గానికి చెందిన పేర్ని నాని తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి రాజకీయాల్లోకి వచ్చారంటారు. ఆయన తన మాటలతో 2024లో తన కుమారుడు మచిలీపట్నంలో ఓటమి పాలయిన తర్వాత రాష్ట్రంలోనూ వైసీపీ అధికారం కోల్పోయిన పిదప పార్టీకి మౌత్ పీస్ గా తయారయ్యారు. అంశం ఏదైనా పేర్ని నాని మాట్లాడే మాటల్లో ఖచ్చితత్వం ఉంటుందని అంటారు.

ఆయన తన వాగ్దాటితో అధికార పక్షంపై విరుచుకుపడతారు. ప్రధానంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేస్తూ పార్టీ క్యాడర్ లో పేరు తెచ్చుకున్నారు. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లో తనకు అండగా ఉండేదుకు పోటీ చేయాల్సిందేనని ఖచ్చితంగా చెప్పడంతో పేర్ని నాని కూడా అందుకు అంగీకరించినట్లు చెబుతున్నారు. సో.. వచ్చే ఎన్నికల్లో పేర్ని నాని పోటీ చేయడం కోసమే యాక్టివ్ అయ్యారని చెబుతున్నారు.

## డీసీపీ రాహుల్ హెగ్డే నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ కలకలం

**జూబ్లీహిల్స్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తన పేరు మీద సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ ను సృష్టించి డబ్బులు వసూలు చేసేందుకు , ఇతర సైబర్ నేరాలకు పాల్పడేందుకు గుర్తించిన డీసీపీ రాహుల్ హెగ్డే స్పందించారు. ఈ సందర్భంగా రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. తన ఫోటో,పేరుతో నకిలీ ఫేస్ బుక్ ఐడి సృష్టించి ఆఫీసర్లు , సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తున్నారని ,వారు యాక్సెప్ట్ చేయగానే, డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. తన ఒరిజినల్ ఫేస్ బుక్ అకౌంట్ ద్వారా అందరినీ అలర్ట్ చేశారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కోరారు. దీనిపై కేసు నమోదు నమోదు చేసి సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయుడి కోసం గ్రామస్తుల నిరసన

ఏన్కూర్ : ఉపాధ్యాయుడి కోసం గ్రామస్తులు నిరసనకు దిగారు. తిమ్మరావుపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడుని డిప్యూటేషన్ పై కొత్త మేడేపల్లికి బదిలీ అయ్యారు. అయితే ఈ డిప్యూటేషన్ ను నిరసిస్తూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. సుమారు 60 మంది పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఒక ఉపాధ్యాయున్ని డిప్యూటేషన్ పద్ధతిపై బదిలీ చేయడాన్ని నిరసిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. చంద్రశేఖర్ వల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని గుర్తు చేశారు. తక్షణమే డిప్యూటేషన్ పై వెళ్లిన చంద్రశేఖర్ ను తిరిగి రప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ వాసవి దేవి చర్యలు తీసుకుంటారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు!



భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవలసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్ధనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు. ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయి నప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది.

అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్పటికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోందన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా)! బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించినంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు.

ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే.

అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది.

ఇదేదో పనీ పాటు లేనివాడెవడో ఊహించి చెప్తున్న విషయం కాదు. అమెరికాలో ''హౌసింగ్ బుడగ'' 2008లో పేలిపోయినప్పుడు ఆ బుడగ పెరుగుతున్న కాలంలో రుణాలు ఇచ్చిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని ప్రధాన బ్యాంకులన్నీ దెబ్బ తిన్నాయి. ఆ రుణాలన్నీ "పనికి మాలిన వ్యర్థ ఆస్తులు"గా ఆ బ్యాంకులకు మిగిలిపోయాయి. అప్పుడు ప్రభుత్వాలు బ్యాంకులకు భారీగా 'బెయిల్ ఔట్" ప్యాకేజీలు ప్రకటించవలసి వచ్చింది. ఆ బెయిల్ అవుట్ల కారణంగా డిపాజిటర్లు గణనీయంగా నష్టపోయారు. ఆ హౌసింగ్ బుడగ పేలుడు తాకిడి తగలకుండా తప్పించుకున్న ఒక ప్రధాన దేశం మనదే. ఎందుకంటే అప్పటికి మన భారతీయ బ్యాంకులలో విదేశీ ఆస్తుల వాటా నామమాత్రమే. దాని వలన "వ్యర్థ ఆస్తుల" వాటా కూడా చాలా తక్కువగానే ఉండింది. ప్రైవేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ మాత్రమే కాస్త గణనీయమైన మోతాదులో ఆ "వ్యర్థ ఆస్తులను" మూటగట్టుకుంది తప్ప ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ దాదాపు ఏ నష్టమూ చవిచూడకుండా బైటపడ్డాయి.

ఇప్పుడు మన బ్యాంకుమీద పెత్తనాన్ని విదేశీ సంస్థల చేతుల్లో పెడితే అప్పుడు మన ఆర్థిక వ్యవస్థకు 2008 నాడు ఉన్న బలం ఇంకెతంమాత్రమూ ఉండదు. బ్యాంకుల మీద విదేశీ పెత్తనాన్ని అనుమతించాలన్న వత్తిడి మనకు నయా ఉదారవాదం వైపు నుండి వస్తోంది. పెట్టుబడుల మీద ఏ విధమైన ఆంక్షలనూ నయా ఉదారవాదం అంగీకరించదు. ముఖ్యంగా ప్రభుత్వాలు ఆంక్షలు పెట్టడాన్ని అది ఒప్పుకోదు. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పెట్టే ఆంక్షలను అది సుతరామూ అంగీకరించదు. అందుకే ప్రస్తుతం ఉన్న 15 శాతం పరిమితినీ తొలగించాలని వత్తిడి చేస్తుంది. అంతేగాక, భారత ఆర్థిక వ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది (నయా ఉదారవాదం అంటేనే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గ్రహించాలి). విదేశీ యజమానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి దన్ను లభిస్తుంది. అదే మాదిరి దన్ను భారతీయ యజమానికి మన ప్రభుత్వం నుండి అభించదు.

ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంలో (1990 దశకానికి ముందు కాలంలో) భారతీయ ఆర్థిక రంగంలో చేపట్టిన పురోగామి చర్యలన్నింటినీ ఇప్పటికే గణనీయంగా నయా ఉదారవాదం తిరుగుముఖం పట్టించింది. ఉదాహరణకు: ప్రాధాన్యతా రంగ రుణాలకు సంబంధించి పాటించవలసిన ప్రమాణాలు నేటికీ కొనసాగుతున్నా, అసలు ప్రాధాన్యతా రంగం అంటే ఏమిటన్న నిర్వచనాన్నే మార్చివేశారు. అంతకు ముందు రైతులు, చిన్న ఉత్పత్తిదారులు, చిన్న వ్యాపారులు, బలహీన వర్గాల వారు ప్రాధాన్యతారంగంగా పరిగణించబడ్డారు. ఇప్పుడు అటువంటి తరగతుల ప్రజలకు బ్యాంకుల నుండి రుణాలు లభించడం దాదాపు అసాధ్యం అయ్యే విధంగా విధానాలను మార్చివేశారు. ఇటీవల ఐద్వా చేసిన అధ్యయనం ప్రకారం, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు బ్యాంకులు 10 శాతం కన్నా తక్కువ వడ్డీకే రుణాలనిస్తున్నాయి. ఆ ఫైనాన్స్ కంపెనీలు పేద మహిళలకు 26 శాతం వడ్డీకి రుణాలను ఇస్తున్నాయి. బ్రిటిష్ వాడి కాలంలో గ్రామాల్లో వడ్డీ వ్యాపారి పేదలను ఏ విధంగా కొల్లగొట్టేవాడో, అదే మాదిరిగా ఇప్పుడు జరుగుతోంది. అంతే కాదు, ఈ ఫైనాన్స్ సంస్థలకు బ్యాంకులు ఇచ్చే రుణాలను ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణిస్తున్నారు! గతంలో బ్యాంకులను జాతీయం చేసినప్పుడు ప్రకటించిన లక్ష్యాలలో వ్యవసాయానికి, చిన్న వ్యాపారులకు, చిన్న పరిశ్రమలకు తేలికగా, మధ్య దళారీలు లేకుండా, రుణాలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం ఒకటిగా ఉంది. ఇప్పుడా లక్ష్యమే దెబ్బ తినిపోయింది.

మరోపక్క బ్యాంకింగ్ రంగం యావత్తూ, ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పనిలో మునిగిపోయింది. ఆ బడా పెట్టుబడిదారులు బ్యాంక్ రుణాలను అత్యధికంగా కాజేయడం, వాటిని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టడం వంటివి చేయకుండా వారి ఆటలు కట్టించడం కోసం గతంలో బ్యాంకులను జాతీయం చేశారు (ఇప్పుడు ప్రభుత్వ రంగ బ్యాంకులలో ప్రభుత్వ వాటా క్రమంగా తగ్గిపోతోందనుకోండి.). ఏదేమైనా మళ్ళీ పూర్వ కాలంలో మాదిరిగా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు, బ్యాంకులతో కుమ్మక్కై (వాస్తవానికి ఒక్కో గుత్త సంస్థకూ ఒక్కో బ్యాంక్ ఉంది) కొల్లగొట్టే పరిస్థితి ఏర్పడింది. బ్యాంక్ రుణాల పంపిణీ మీద సామాజిక నియంత్రణ క్రమంగా లేకుండా పోయే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు దీనికి తోడు బ్యాంకుల యాజమాన్యమే విదేశీ సంస్థల చేతుల్లోకి పోయిందనుకోండి. అప్పుడు పేదలు, మధ్య తరగతి బ్యాంక్ రుణాలకు మరింత దూరం అవుతారు. బడా పెట్టుబడిదారులు బ్యాంక్ రుణాలను కాజేసి మరింత బలుస్తారు. బ్యాంకులలో దాచుకున్న ధనం మరింతగా స్పెక్యులేటివ్ కార్యకలాపాలకు మళ్ళించబడుతుంది. దేశాన్ని పాలించేది ఫాసిస్టు తరహా శక్తులైనప్పుడు వారి నుండి ఇంతకన్నా ఏం ఆశించగలం ఈ ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించడమే మన ముందున్న కర్తవ్యం.

# తుంటికి తక్షణ రక్షణ.. శస్త్రచికిత్సలో అత్యాధునిక పద్ధతులు



## సర్జరీ తర్వాతి రోజే నడిచే వెసులుబాటు

తుంటి ఎముకలు%ొ% సాధారణంగా చాలా బలంగా ఉంటాయి. అంటే ఈ తుంటి ఎముకలు అంత సులువుగా దెబ్బతినవు. యుక్త వయసు వారిలో ఏదైనా పెద్ద ప్రమాదాల్లో గాయాలకు గురైనప్పుడు తప్ప తుంటి ఎముకలు విరగడం అన్నది జరగదు. నడుచుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడటం, మెట్లు దిగుతూ జారిపడిన సందర్భాల్లో సాధ్యమైనంత వరకు తుంటి విరగదు. కానీ, వయసు పైబడిన వారిలో అంటే 60-70 ఏండ్లు దాటిన వారి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. అలా నడుస్తూ కిందపడినా తుంటి ఎముక విరిగే ప్రమాదం ఉంటుంది. దీనికి కారణం వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనం కావడమే! పెద్ద వయసులో తుంటి ఎముక దెబ్బతింటే వాళ్లు కూర్చున్న చోటు నుంచి, పడుకున్న చోటు నుంచి పైకి లేవలేరు. నడవ లేరు కూడా! తుంటి ఎముక విరిగిన వారికి సరైన చికిత్స అందించకపోతే వాళ్లు మంచానికే పరిమితమవుతారు. దీనివల్ల శరీరంలో కదలికలు లేకపోవడంతో కొత్త రోగాలు పలకరిస్తాయి. అయితే ఇలాంటి రోగులకు గతంలో చికిత్స చేయాలంటే కూడా వయసు కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. వాటిని అధిగమించి చికిత్స అందించేలోపు రోగులు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లే పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు అలాంటి సమస్యలను అధిగమించేందుకు అత్యాధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని చెబుతున్నారు ఆర్థో వైద్య నిపుణులు. సర్జరీ జరిగిన మరునటి రోజే రోగి లేచి స్వతహాగా నడవవచ్చంటున్నారు. తుంటి ఎముక శస్త్ర చికిత్సలో వచ్చిన అత్యాధునిక వైద్య పద్ధతులు ఏమిటి వాటి వల్ల రోగికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం. యుక్తవయసు వారిలో కంటే 60-70 ఏండ్లు దాటిన వృద్ధుల్లో ఎముకలు చాలా బలహీనంగా ఉంటాయి. దీనికి ప్రధాన కారణం వయసు పెరిగే కొద్దీ ఎముకల్లో క్యాల్షియం తగ్గిపోతూ ఉంటుంది. ఇలా ఎముకల్లో క్యాల్షియం తగ్గిపోవడాన్నే వైద్య పరిభాషలో 'ఆస్టియోపొరోసిస్' అంటారు. దీనివల్ల వృద్ధులు నడుస్తూ కిందపడిపోయినా లేక తేలికపాటి గాయాలైనా కూడా వారిలో ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఎక్కువ. ముఖ్యంగా వృద్ధులు నడుస్తూ కాలు జారి కింద పడటం, లేదా తట్టు తగిలి పడటం, బాత్రూమ్‌లో జారి పడటం లాంటివి జరిగినప్పుడు వారిలో తుంటి ఎముక విరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ప్రాణాల మీదికి..: సాధారణంగా తుంటి విరిగిన రోగులు మంచానికే పరిమితమవుతారు. సకాలంలో శస్త్రచికిత్స చేయకపోతే వారు లేచి నడవలేరు, కూర్చోలేరు. దీంతో శరీరంలో కదలికలు లేక, మంచానికే పరిమితమవుతారు. దీనివల్ల బెడ్‌సోర్స్ వచ్చి, రోగి మరింత బలహీనమవుతాడు. శరీరంలో కదలికలు లేకపోవడంతో జీవక్రియలు నిలిచిపోయి గుండె, కాలేయం, ఊపిరితిత్తులు లాంటి ప్రధాన అవయవాల పనితీరు మందగించి రోగి ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

అన్నీ కలిసొస్తేనే..: తుంటి ఎముక విరిగినప్పుడు గతంలో జరిపే శస్త్రచికిత్సల్లో ఇంప్లాంట్స్‌ను వేసి ఎముకలను అతికించేవారు. అయితే వయసు కారణంగా రోగి ఎముకలు బలహీనంగా ఉండటం వల్ల తుంటి ఎముక డొల్లగా మారి, ఇంప్లాంట్‌కు వేసిన స్క్రూలు ఊడిపోవడం, ఎముక మళ్లీ విరిగిపోవడం జరిగి శస్త్రచికిత్సలు విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. అంతే కాకుండా రోగికి శస్త్రచికిత్స చేయాలంటే అందుకు సంబంధించిన కొన్ని ప్రాథమిక వైద్యపరీక్షలు చేయాల్సి ఉంటుంది.

అందులో ముఖ్యంగా గుండె పరీక్ష, బీపీ, షుగర్, కాలేయం, కిడ్నీ తదితర అవయవాల పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అయితే వృద్ధుల్లో చాలామందికి కొన్ని అనారోగ్య సమస్యలు ఉండటం వల్ల%ొ% ముందుగా వాటికి చికిత్స చేయాల్సి వచ్చేది. అన్నీ కుదురుకున్న తరువాతే తుంటికి శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చేది. దీంతో పుణ్యకాలం కాస్తా గడిచి.. రోగి ఆరోగ్యం మరింత దెబ్బతినేది. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స చేసేలోపే రోగి మృత్యువాతపడేవాడు. వీటన్నింటినీ అధిగమించడానికి హిప్ ఫ్రాక్చర్ సర్జరీల్లో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి.

ఆధునిక చికిత్సా పద్ధతులు: తుంటి ఎముక విరిగిన రోగులకు అత్యాధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. అందులో ముఖ్యంగా 5 విధానాలు ఉన్నాయి. 1. ట్రైమ్ టు థియేటర్ 2. కాంప్రహెన్సివ్ ఆర్థో జరియాట్రిక్ కేర్ 3. అనస్తీషియా అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ 4. అడ్వాన్స్‌డ్ ఇంప్లాంట్స్ 5. అడ్వాన్స్‌డ్ రిహాబిలిటేషన్

ట్రైమ్ టు థియేటర్: తుంటి ఎముక విరిగిన రోగికి నిర్ణీత సమయంలో చికిత్స అందించాలి. అంటే 48 గంటల్లో శస్త్రచికిత్స చేయాలి. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఆధునిక పద్ధతిలో రోగికి వేరే ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, వాటికి చికిత్స అందిస్తూనే మరో పక్క తుంటికి శస్త్రచికిత్స చేస్తారు. ఇలా చేయడం వల్ల రోగికి వైకల్యంతోపాటు ప్రాణాపాయం తగ్గినట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. కాంప్రహెన్సివ్ ఆర్థో జరియాట్రిక్ కేర్ : వయసు పైబడిన వారిలో ఏదో ఒక అనారోగ్య సమస్య ఉండటం సర్వసాధారణం. అందుకని ఆధునిక పద్ధతిలో జరియాట్రిషన్ పర్యవేక్షణలో శస్త్రచికిత్సకు ముందు, సర్జరీ సమయంలో, ఆ తరువాత కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వయసురీత్యా ఉన్న అనారోగ్య సమస్యలకు చికిత్స అందించడం జరుగుతుంది.

అనస్తీషియా, పెయిన్ మేనేజ్‌మెంట్ : తుంటి విరిగిన రోగులకు తీవ్రమైన నొప్పి ఉంటుంది. రోగులు అటూ, ఇటూ కదల్లేని పరిస్థితి. దీనివల్ల అప్పటికే ఉన్న గుండె సమస్యలు లేదా కిడ్నీ, కాలేయ సమస్యలు వంటివి మరింత తీవ్రమవుతాయి. అందుకని పెయిన్ రిలీవింగ్ పద్ధతులైన ఫేసియా, ఇలియకా బ్లాక్, రీజినల్ బ్లాక్ చికిత్స అందించడం జరుగుతుంది. దీనివల్ల రోగిలో నొప్పిని తగ్గించడంతో పాటు నొప్పి నివారణ కోసం అందించే మందుల డోస్‌ను తగ్గించడం జరుగుతుంది. ఇలా ఔషధాల డోస్ తగ్గించడంతో దుష్ప్రభావాలు కూడా తగ్గుతాయి.

అడ్వాన్స్‌డ్ రిహాబిలిటేషన్: తుంటి ఫ్రాక్చరైనరోగిమంచానికే పరిమితమవడం ఒకప్పటి మాట. ఇప్పుడు ఆ అవసరం లేదు. సర్జరీ జరిగిన రెండో రోజు నుంచే రోగి అటూ ఇటూ కదలడం, లేచి నిలబడటం, నడవటం లాంటివి చేయవచ్చు. ఫిజియోథెరపిస్టుల సహకారంతో రోగిని కచ్చితంగా నడిపించడమే ఈ అడ్వాన్స్‌డ్ రిహాబిలిటేషన్.

సెకండరీ ప్రివెన్షన్: తుంటి ఆపరేషన్ తరువాత రోగి బాగానే నడుస్తున్నాడు కదా అని నిర్లక్ష్యం చేస్తే రెండో వైపు తుంటి విరిగే అవకాశం ఉంటుంది. ఎందుకంటే వయసు వల్ల వచ్చే ఆస్టియోపొరాసిస్ వల్ల ఎముకలు బలహీనపడతాయి. అందుకని సర్జరీ తరువాత ఆస్టియోపొరాసిస్ చికిత్స తప్పనిసరి. దీని వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి.

అడ్వాన్స్‌డ్ ఇంప్లాంట్స్: అడ్వాన్స్‌డ్ ఇంప్లాంట్స్‌లో రెండు పద్ధతులు ఉన్నాయి. 1.ట్రామా సిమ్ 2. డ్యూయల్ మొబిలిటీ హిప్ రీప్లేస్‌మెంట్

1. ట్రామాసిమ్ పద్ధతి : సాధారణ పద్ధతిలో అయితే సర్జరీ చేసేటప్పుడు బలహీనమైన ఎముకను ఇంప్లాంట్ (రాడ్)తో బిగిస్తారు. అయితే సర్జరీ తరువాత రోగి నడిచేటప్పుడు ఈ ఇంప్లాంట్ కదలికకు గురై చికిత్స విఫలమయ్యే అవకాశాలు ఎక్కువ. అందుకని ట్రామాసిమ్ పద్ధతిలో ఎముకను ఇంప్లాంట్ కదలకుండా గట్టిగా పట్టుకునే విధంగా బోన్ సిమెంట్‌ను ఇంజక్ట్ చేస్తారు.

దీని వల్ల ఎముక, ఇంప్లాంట్, సిమెంట్ కలిసి ఒక బలమైన నిర్మాణంగా మారుతుంది. ఫలితంగా శస్త్రచికిత్స జరిగిన రెండో రోజు నుంచే లేచి నడిచే విధంగా రోగి బరువును శస్త్రచికిత్స చేసిన ఎముక మోయగలుగుతుంది. డ్యూయల్ మొబిలిటీ హిప్ రీప్లేస్‌మెంట్ : వృద్ధులు కిందపడి గాయాలైనప్పుడు కొన్ని సందర్భాలలో తుంటి ఎముక పూర్తిగా దెబ్బతింటుంది. అలాంటప్పుడు తుంటి మార్పిడి చేయాల్సి వస్తుంది. అయితే సాధారణంగా తుంటి మార్పిడి చేసినప్పుడు కృత్రిమ కీళ్లు తొలగిపోయే అవకాశం ఉంటుంది. అదే డ్యూయల్ మొబిలిటీ పద్ధతిలో అయితే ఇలా కృత్రిమ కీళ్లు తొలగిపోయే అవకాశాలు చాలా తక్కువ.



## అయినా.. పాలు పట్టొచ్చు!

బిడ్డకు తల్లిపాలను మించిన పౌష్టికాహారం లేదన్న సంగతి తెలిసిందే. అయితే, మారుతున్న జీవనశైలితో చాలామంది చిన్నవయసులోనే 'దయాబెటిక్' బారిన పడుతున్నారు. ఇలాంటి షుగర్ బాధితులు.. పిల్లలకు పాలు పట్టొచ్చా? అని చాలామంది అనుమాన పడుతుంటారు. ఈ విషయంలో.. వైద్య నిపుణులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. టైప్-1, టైప్-2, ప్రెగ్నెన్సీ దయాబెటిక్ బాధితులు పిల్లలకు పాలు ఇవ్వొచ్చని 'అమెరికన్ దయాబెటిస్ అసోసియేషన్' స్పష్టం చేస్తున్నది. దీనివల్ల బిడ్డతోపాటు తల్లికీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నది. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల%ొ% దయాబెటిక్ తల్లుల శరీరంలో ఉత్పత్తయ్యే ఇన్సులిన్ బాగా పనిచేస్తుందట. రక్తంలో గ్లూకోజ్ స్థాయులు కూడా నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. ఇక ప్రెగ్నెన్సీ దయాబెటిక్ (గర్భధారణ సమయంలోనే వచ్చే మధుమేహం) ఉన్న మహిళలు.. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తరువాతి దశలో టైప్-2 దయాబెటిస్ వచ్చే అవకాశం 15-30% తగ్గుతుందని అంటున్నారు. టైప్-1 దయాబెటిస్ ఉన్న మహిళలు పాలు పట్టడం వల్ల.. ఇన్సులిన్ అవసరాలు 25-50% తగ్గుతాయట. ఎందుకంటే, వారిలో పాల ఉత్పత్తి కోసం రక్తంలోని గ్లూకోజ్ అవసరం పడుతుంది. అదేవిధంగా, టైప్-2 దయాబెటిస్ ఉన్న తల్లుల్లోనూ బ్రెస్ట్ ఫీడింగ్ ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయులు నియంత్రణలో ఉంటాయని అంటున్నారు. అదే సమయంలో.. దయాబెటిస్ నియంత్రణ కోసం జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే.. ప్రసవానంతరం చాలామందిలో ఒత్తిడి అధికం అవుతుంది. పాలు ఇస్తున్నప్పుడు రోజువారీ కేలరీల అవసరం పెరుగుతుంది. కాబట్టి, అందుకు తగ్గట్టుగా, తల్లిగా కొత్త జీవితానికి సరిపోయేలా ఆరోగ్యకరమైన అలవాట్లను ప్లాన్ చేసుకోవాలని చెబుతున్నారు. భోజనంలో లీన్ ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. అధిక ఫైబర్ ఉండే తృణధాన్యాలు, చిక్కుళ్లు, కూరగాయలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ భోజనం దాటవేయవద్దు. ఎందుకంటే ఇది ఇన్సులిన్ స్థాయులను ప్రభావితం చేస్తుంది. దీన్ని నివారించడానికి స్నాక్స్‌లో ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి. శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండేందుకు.. రోజూ 3-4 లీటర్ల నీళ్లు తాగాలి. ఈ అలవాటు పాల ఉత్పత్తితోపాటు రక్తంలో గ్లూకోజ్ నియంత్రణకు సహాయపడుతుంది. వైద్యుల సలహా మేరకు తేలికపాటి వ్యాయామాలు చేయాలి. దీనివల్ల మానసిక స్థితి కూడా మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

# అసలు చేపలను తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

## వారంలో ఎంత మోతాదులో తినాలి..?



మాంసాహారం తినేవారు చాలా మందికి చేపలు అంటే ఇష్టమే. చేపలను తినేవారు సీఫుడ్ ప్రియులు ప్రత్యేకంగా ఉంటారు. చేపలతో ఎలాంటి వంటకాలు చేసినా సరే లాగించేస్తారు. అయితే ఆరోగ్యకరమైన మాంసాహారం ఏది.. అని అడిగితే అందులో చేపలు కచ్చితంగా ముందు వరుసలో నిలుస్తాయని చెప్పవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ చేపలను తినాలని వైద్యులు, పోషకాహార నిపుణులు సైతం చెబుతుంటారు. అయితే చేపలను తినడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయి, వారంలో చేపలను ఎన్ని సార్లు తినవచ్చు. ఎంత మోతాదులో తినాలి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక శాతం మంది నాన్ వెజ్ ప్రియులు తింటున్న ఆహారాల్లో చేపలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లతోపాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక చేపలను తరచూ తింటే ఎన్నో లాభాలను పొందవచ్చు.

గుండె, మెదడు ఆరోగ్యానికి..: చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా సముద్రపు లేదా మంచినీటి చేపల్లో ఇవి ఇంకా ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించేందుకు సహాయం చేస్తాయి. రక్తంలో అధికంగా ఉండే ట్రై గ్లిజరైడ్ స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, గుండె పోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. చేపల్లో ఉండే డీహెచ్‌ఏ మెదడు, కంటి రెటీనా కణాలను రక్షిస్తుంది. మెదడు ఎదుగుదలకు సహాయం చేస్తుంది. దీని వల్ల వయస్సు మీద పడుతున్నప్పటికీ మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. మతిమరుపు తగ్గుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. వృద్ధాప్యంలో వచ్చే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నుంచి బయట పడవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

విటమిన్ డి కోసం..: చేపల్లో హై క్వాలిటీ ప్రోటీన్లు ఉంటాయి. మన శరీరానికి కావల్సిన 9 ముఖ్యమైన అమైనో యాసిడ్లు చేపల ద్వారా మనకు లభిస్తాయి. ఇవి కండరాల మరమ్మత్తుకు సహాయపడతాయి. కణజాలం వృద్ధి చెందేలా చేస్తాయి. శరీరంలో పలు జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు దోహదం చేస్తాయి. కండరాలు ప్రశాంతంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

కండరాల నొప్పులు తగ్గుతాయి. శారీరక శ్రమ, వ్యాయామం చేసే వారికి ఎంతో మేలు జరుగుతుంది. చేపలను తినడం వల్ల విటమిన్ డి మనకు సహజసిద్ధంగా లభిస్తుంది.

సాధారణంగా మనకు విటమిన్ డి సూర్యరశ్మి ద్వారా లభిస్తుంది. కానీ విటమిన్ డి లోపం ఉన్నవారు చేపలను తింటుంటే ఆ లోపం నుంచి బయట పడవచ్చు. దీని వల్ల ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

ఎంత తినాలి..?: చేపలను తింటే విటమిన్ బి12 కూడా సహజసిద్ధంగా లభిస్తుంది. చాలా మందికి విటమిన్ బి12 లోపం ఉంటుంది. అలాంటి వారు చేపలను తింటుంటే మేలు జరుగుతుంది. విటమిన్ బి12వల్ల నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మెడ, భుజాలనొప్పులు, కండరాల నొప్పులు తగ్గిపోతాయి. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. చేపల్లో అయోడిన్ అధికంగా ఉంటుంది. ఇది థైరాయిడ్ ఉన్నవారికి మేలు చేస్తుంది. థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. చేపలను తినడం వల్ల సెలీనియం అధికంగా లభించి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. చేపల్లో ఉండే డీహెచ్‌ఏ కంటి ఆరోగ్యానికి సహాయం చేస్తుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. చేపలు ఆరోగ్యకరమే అయినప్పటికీ మోతాదులోనే తినాలి.

## పూల వర్షం కురవాలంటే..

పెరటి తోటల్లో ఆకు కూరలు, కూరగాయలతోపాటు ఎక్కువగా కనిపించేవి పూల మొక్కలే! అందులోనూ గులాబీలను చాలామంది ఇష్టంగా పెంచుకుంటారు. ఇవి ఇంటికి కొత్త అందాన్ని ఇవ్వడంతోపాటు ఆడవాళ్లకూ అనేక రకాలుగా ఉపయోగపడతాయి. అయితే, సరైన నిర్వహణ లేకపోతే.. ఆకులే తప్ప గులాబీలు కనిపించవు. అలా కాకుండా, చెట్టు మొత్తం విరగబూయాలంటే.. కొన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మొక్క అడుగుభాగంలోని కొమ్మలను క్రమపద్ధతిలో ఉంచితే.. గులాబీలు విరివిగా పూస్తాయి. నాటిన వెంటనే పూల కోసం చూడకుండా.. పక్క కొమ్మలు ఎక్కువ వచ్చేలా అనువైన పరిస్థితులు కల్పించాలి. గులాబీల్లో కొమ్మ వంచడం అనేది అతి ముఖ్యమైనది. దీని వల్ల కింది భాగంలోని శాఖీయ మొగ్గకు పోషకాలు ఎక్కువగా అంది.. పొడవైన కాడలతో పూలు వస్తాయి. మూడు నెలల వయసున్న మొక్కల్లో బెండింగ్ చేయడం వల్ల వాటి ఉత్పాదక శక్తి పెరుగుతుంది. కత్తిరింపులతో కాండం, కాడ అడుగు భాగం దృఢంగా మారుతుంది. మొక్క ఎత్తుగా పెరుగుతుంది. ఇందుకోసం బలహీనంగా ఉన్న కాడలను గుర్తించి.. వాటిని కత్తిరించేయాలి. దీనివల్ల కాండం మరింత దృఢంగా తయారవుతుంది. పువ్వులను కోసేటప్పుడు.. ఒకటి/ రెండు ఆకులు మాత్రమే ఉంచి, మిగతా కాడ భాగం పువ్వుసహా కత్తిరించాలి.



# 26 నుంచి చైనాకు విమాన సర్వీసులు



న్యూఢిల్లీ, : కోవిడ్-19, గల్వాన్ లోయలో సైనికుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా ఐదేళ్లుగా నిలిచిపోయిన భారత్-చైనా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. భారత విదేశాంగ శాఖ ఈ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి విమాన సేవలు మొదలవుతాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. పర్యాటకం, వాణిజ్యం, వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యం. ఇండిగో కోల్‌కతా-గ్వాంగ్జూ సర్వీసులను ప్రకటించింది. కరోనా వైరస్ వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్, చైనాల మధ్య ఐదేళ్లుగా నిలిచిపోయిన విమాన సర్వీసులు.. పునఃప్రారంభం కానున్నాయి. ఇరు దేశాల మధ్య ఈ అంశంపై పలు దఫాలుగా చర్చలు జరిగాయి. తాజాగా డైరెక్ట్ విమానాల పునఃప్రారంభానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్టు భారత విదేశాంగశాఖ అక్టోబరు 2న ప్రకటించింది. వింటర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకొని.. ఈ నెల చివర నాటికి వివిధ నగరాల మధ్య విమాన సర్వీసులు పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలకు చెందిన ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసుకుంటాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇరు దేశాల పౌరవిమానయాన అధికారుల మధ్య సాంకేతికస్థాయి చర్చలు జరిగినట్టు తెలిపింది. దీంతో అక్టోబరు 26 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.మధ్య సరిహద్దుల్లో ఐదేళ్ల నుంచి నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ-చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లు, ఇరు దేశాల విదేశాంగ శాఖ అధికారుల మధ్య జరిగిన భేటీల్లో దీనిపై ప్రధానంగా చర్చించారు.. గత కొద్ది నెలలుగా భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం ప్రధాని చైనా వెళ్లినప్పుడు విమాన సేవల పునఃప్రారంభానికి సూత్రప్రాయంగా అంగీకరించాయి. తాజాగా, అవగాహనకు రావడంతో ఐదేళ్ల తర్వాత భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలుకానున్నాయి.ఇక, విదేశాంగ శాఖ ప్రకటన వెలువడిన కాసేపటికే చైనాకు విమాన సర్వీసుల పునఃప్రారంభంపై ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఇండిగో ప్రకటన చేసింది. కోల్‌కతా నుంచి గ్వాంగ్జూ మధ్య అక్టోబరు 26 నుంచి రోజూ నాన్-స్టాప్ సర్వీసులు నడుస్తాయని తెలిపింది. డీజీసీఏ నిబంధనలకు లోబడి ఢిల్లీ-గ్వాంగ్జూ విమానాలను త్వరలోనే నడుపుతామని పేర్కొంది.ఇరు దేశాల మధ్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, సరిహద్దు వాణిజ్యం, వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య మార్గాల పునఃస్థాపనలో భాగంగా ఇండిగో తన ఎయిర్‌బస్ ం320 నియో విమానాలను ఉపయోగిస్తుందని తెలిపింది. ఇరుదేశాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వ్యాపార, పర్యటక, విద్యా రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. దౌత్యపరమైన సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన ఉద్రిక్తతల తగ్గుముఖం పట్టడానికి సంకేతంగా భావిస్తున్నారు. అమెరికా-భారత్ వాణిజ్య చర్చలు, డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. ఎస్‌సీఓ భేటీ అనంతరం మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మోదీ, జిన్‌పింగ్‌లు కలిసి ఫోటోలు దిగారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కసువెళ్లగక్కడం గమనార్హం.

# పాతకాపుకే కమలం టిక్కెట్



హైదరాబాద్, తెలంగాణ దిశ : హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బైపోల్ కోసం అన్ని రాజకీయ పార్టీల కుస్తీ పడుతున్నాయి. కాషాయం పార్టీ సైతం కసరత్తు స్పీడప్ చేసింది. ఇప్పటికే కమిటీలు వేసి కాలనీల్లో బూత్ మీటింగ్స్ నడిపిస్తోంది. మానిటరింగ్ కమిటీతోపార్టీ చీఫ్ రాంచందర్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి.. ప్రస్తుతం ప్రచార వ్యూహాలు, టికెట్ రేసులో ఉన్నవారి పేర్లపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇంతకీ బీజేపీ లేటెస్ట్ జూబ్లీహిల్స్ రూట్ మ్యాప్ ఎంటో తెలుసుకుందాం.గ్రేటర్ హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం భారతీయ జనతా పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, గరికపాటి మోహన్ రావు, చింతల రామచంద్రా రెడ్డి, గౌతంరావులతో బై పోల్ కి మానిటరింగ్ కమిటీ వేసింది అధిష్టానం. నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు పార్టీ తరుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బూత్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేసుకుని చాపకింద నీరులా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాషాయ దళం క్యాంపెయినింగ్ కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు,ఇక ముందు అనుసరించాల్సిన వ్యూహాలపై మానిటరింగ్ కమిటీతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు అత్యవసర భేటి అయ్యారు. బూత్ లెవల్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్రప్ర భుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.జూబ్లీహిల్స్ ఓటర్ నాడీ తెలుసుకుని అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకుంటున్నారు. ముఖ్యంగా బీజేపీ తరపున అభ్యర్థి ఎవరన్నదానిపై పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. టికెట్ కావాలంటూ ఇప్పటి వరకు రాష్ట్ర నాయకత్వానికి వచ్చిన వినతులపైనా చర్చించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి తనకే మళ్లీ అవకాశం ఉంటుందన్న గట్టి ధీమాతో ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అన్ని కార్యక్రమాలు నియోజకవర్గంలో ఆయనే చూసుకుంటున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సపోర్ట్ తనకే ఉంటుందని, టికెట్ పక్కా లంకలకే అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.మరోవైపు జూబ్లీహిల్స్ బీజేపీ టికెట్ రేసులో లంకల దీపక్ రెడ్డి తర్వాత బలంగా వినిపిస్తున్న పేర్లు కీర్తి రెడ్డి, ఆకులవిజయ, వీరపనేని పద్మ.ఈ ముగ్గురు మహిళా కోటాలో తమకు అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారు.కీర్తిరెడ్డి గతంలోనూ జూబ్లీహిల్స్ టికెట్ ఆశించారు. కిషన్ రెడ్డి అనుచర వర్గం కావడం, ఆర్థికంగా బలంగాఉండటం, మహిళా కేటగిరీఆమెకి కలిసివస్తుందని అనుకుం టున్నారు. ఇప్పటికే ఆమె తన మనసులోని మాట రాష్ట్ర నాయకత్వం ముందు పెట్టినట్లు తెలుస్తోంది.టికెట్ ఆశిస్తున్న మరో మహిళా నేత ఆకుల విజయ. రాష్ట్రంలో బీసీ చూట్టే రాజకీయం నడుస్తున్న వేళ జూబ్లీహిల్స్‌లో బీసీలకు అవకాశం ఇవ్వాలనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు.ఆకుల విజయ బీసీ మహిళ.గతంలో మహిళామోర్చా అధ్యక్షురాలిగా పనిచేయడం, కొద్దిమంది మద్దతు ఉండటంతో టికెట్ ఇస్తారన్న ఆశలు పెట్టుకున్నారు. బీజేపీ నుంచి కూడా బీసీనైన తనకు సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మరో బీజేపీ మహిళా నేత వీరపనేని పద్మ కూడా టికెట్ ఇస్తే పోటీ చేస్తానంటూ రిక్వెస్ట్ పెట్టుకున్నారు.మొత్తంగా ఓ వైపుజూబ్లీహిల్స్‌లో గెలుపుకోసం వ్యూహాలు రచిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమలంపార్టీ..గెలుపు గుర్రంగా ఎవరిని బరిలోకి దించుతుందన్న ఆసక్తి కంటిన్యూ అవుతోంది..!

# ఒకే కాలనీకి ఐదు పేర్లు...

మెదక్, తెలంగాణ దిశ : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఒక చిన్న కాలనీ కులాలకుమ్ములా టలతో వార్తల్లో నిలిచింది. మొదట వినాయక నగర్‌గా ఐక్యంగా ఉన్న కాలనీ, ఆ తర్వాత కులాల ఆధిపత్యంతో విడిపోయింది. కేవలం 25 ఇళ్లు ఉన్న ఆ కాలనీ ఇప్పుడు రెడ్డి, ఆర్యవైశ్య, యాదవ, ముదిరాజ్, విశ్వకర్మ ఎన్‌క్లేవ్‌లుగా పలు పేర్లతో దర్శనమిస్తోంది. ఈ కుల పిచ్చి ఎక్కడికి పోతుందో అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో ఉన్న ముట్రాజ్‌పల్లి రోడ్డు పక్కన ఉన్న కాలనీ వింత ఘటనతో వార్తల్లో నిలిచింది. కేవలం 25 ఇళ్లు ఉన్న ఒక చిన్న కాలనీ ఆరు పేర్లతో దర్శనమిస్తోంది. కాలనీ ఏర్పడిన కొత్తలో అందరూ కలిసికట్టుగా 'వినాయక నగర్' అని పేరు పెట్టుకున్నారు. మొదట అందరిలో ఐకమత్యం వెల్లివిరిసింది. కానీ.. కాలం గడిచేకొద్దీ లోపల దాగి ఉన్న కుల పిచ్చి మెల్లమెల్లగా బయటపడింది. ఆ కాలనీలో 70 శాతం మంది ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఆ అహంకారంతో వారు కాలనీ ప్రవేశ ద్వారం వద్ద తమ కులం పేరుతో ఒక బోర్డు పెట్టారు.దీంతో మిగిలిన 30 శాతం కుటుంబాలకు చెందినవారు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఏంటండీ ఇది.. మేము కూడా ఇక్కడే ఉంటున్నాం కదా మాకు కూడా ఇళ్లు ఉన్నాయి. మీరు మీ కులం పేరుతో మాత్రమే బోర్డు పెడితే ఎలా.. మాకు కులం పేరు ఉంది కదా..' అంటూ నిలదీశారు. అయితే.. మెజారిటీ కుటుంబాలు తమ పంతం వదలలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ఐక్యమత్యం మాయమైంది.ఇక ఆ తర్వాత ఎవరికి వారుగా కులాల పేర్లతో బోర్డులు పెట్టడం మొదలుపెట్టారు. ఒక పక్క 'వినాయక నగర్' అని పాత బోర్డు ఉండగానే.. దాని పక్కనే కొత్త బోర్డులు వెలిశాయి. రెడ్డి ఎన్‌క్లేవ్, ఆర్యవైశ్య ఎన్‌క్లేవ్, యాదవ్స్ ఎన్‌క్లేవ్, ముదిరాజ్ ఎన్‌క్లేవ్, విశ్వకర్మ ఎన్‌క్లేవ్ ఇలా ఐదు కులాల పేర్లతో ఐదు కొత్త బోర్డులు పెట్టారు. కేవలం 25 ఇళ్లు ఉన్న కాలనీకి ఇప్పుడు ఐదు పేర్లు. ఈ ఘటన గజ్వేల్‌లో ఒక వింత అయిపోయింది. 'ఈ కాలనీకి వెళ్లాలంటే ఏ అడ్రస్ చెప్పాలి' అని చర్చించుకుంటున్నారు. మీ కులాన్ని బట్టి ఏదో ఒక వైపునకు వెళ్లండి అని సమాధానం వస్తున్నట్లు స్థానికులు వ్యంగ్యంగా చెబుతున్నారు.ఈ సంఘటనను చూసిన కొందరు 'ఈ కుల పిచ్చి ఫీక్స్‌లో ఉంది. ఎక్కడ చూసినా, ఏ పనిలో చూసినా కులాల ప్రస్తావన వస్తోంది. ఇళ్ల పేర్లను కూడా వదలడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిన్న కాలనీలో జరిగిన ఈ సంఘటన కులాల మధ్య ఉన్న విభేదాలను, కులగజ్జి ఎంత లోతుగా పాతుకుపోయిందో మరోసారి నిరూపించింది

# జనసేన పార్టీలో కీలక మార్పులు

## నాగబాబు పదవి రామ్ తాళ్లూరికి



విజయవాడ, తెలంగాణ దిశ : జనసేన పార్టీ వ్యవహారాలను చూసే బాధ్యతలను రామ్ తాళ్లూరికి అప్పగిస్తూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. రామ్ తాళ్లూరి ఇక నుంచి పార్టీ సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్వహిస్తారని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా రామ్ తాళ్లూరిని నియమించినట్లు అయింది. ఆయన పార్టీ అంతర్గత అంశాలను చూసుకుంటారని ప్రకటించారు. ఇప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు చూస్తున్న వ్యవహారాలు మొత్తం ఇక నుంచి రామ్ తాళ్లూరి చూస్తారు. ఇప్పటికే జనసేన పార్టీ ఐటీ విభాగాన్ని రామ్ తాళ్లూరినే చూసుకుంటున్నారు. నాగబాబు బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తూ పవన్ నిర్ణయం తీసుకున్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి ఆయన కలసి పని చేస్తున్నారు. తన నియామకంపై రామ్ తాళ్లూరి సంతోషం వ్యక్తం చేశారు. పవన్ ను మొదటిసారి కలిసిన రోజు నుంచి అదే ఉత్సాహం, ప్రజల కోసం అంకితభావం కొనసాగుతోందన్నారు.


పార్టీ వ్యవహారాల కోసం నాగబాబు ఎక్కువ సమయం కేటాయించలేకపోవడం ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణించాలని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారు.

ఈ నియామకం అందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు. రామ్ తాళ్లూరి ఖమ్మంజిల్లాకు చెందిన ఎన్నారై. సినిమాలు కూడా నిర్మించారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందారు. రామ్ తాళ్లూరి అమెరికాలో లీడ్ ఐటీ కార్ప్ , ఫ్లై జోన్ ట్రాంపోలిన్ పార్క్, రామ్ ఇన్నోవేషన్స్ (రియల్ ఎస్టేట్) వంటి వ్యాపారాలను నడుపుతున్నారు. సినిమా రంగంలో రాఖీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సినిమాలు నిర్మించారు.

పిఠాపురం జనసేనలో మర్రెడ్డి శ్రీనివాసరావు మార్పు తప్పదా: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఇంచార్జ్ ఎవ్వరు అనేదానిపై పెద్ద డౌట్ వ్యక్తం అవుతోంది.. ఎందుకంటే పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తోన్న మర్రెడ్డి శ్రీనివాసరావును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా జోరుగా సాగడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.. స్థానికంగా ఆయనపై పార్టీలో ఉన్న అసంతృప్తే ఆయన పెద్దగా చురుగ్గా ఉండడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.. అయితే ఆయనకు పార్టీ అధినేత నుంచి పుష్కలంగా ఆశీస్సులు ఉండడం, ఆయనపై అధిష్టానానికి సానుకూలత ఉండడంతో ఆయన ముందుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అయితే గత కొంత కాలంగా ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌పై వస్తున్న పుకార్ల ఈనేపథ్యంలోనే ఇటీవల నియోజకవర్గంలో పర్యటించిన జనసేన ముఖ్యనేత, ఎమ్మెల్సీ హరిప్రసాద్ విలేకరులు అడిగిన ప్రశ్నకు షాకింగ్ సమాధానం ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీలో ముందునుంచి అన్నీతామే వ్యవహరించిన వారిని పక్కన పెట్టారని, కొత్తగా వైసీపీలో నుంచి, ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారిని పార్టీలో ప్రాముఖ్యత ఇస్తున్నారని ముందునుంచి కొంత మందిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పలు సందర్భాల్లో బట్టబయలంది.. ఇది చేబ్రోలు సీతారామాలయంలోని జే గంట విషయంలో బయటపడింది. అయితే ఇటువంటి సందర్భాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, లేక ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఇలా ఎవరో ఒక నేతలు వచ్చి సర్ది చెప్పడం పరిపాటిగా మారింది..ఇక్కడ విషయాలన్నీ జనసేనాని దృష్టికి వెళ్లడం లేదని,

తమ గోడు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదని చాలా మంది జనసేన పార్టీ నేతలే లోలోన మధనపడిన పరిస్థితులున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది..దీనికి తోడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థానికంగా లేకపోవడం, ఆయన ఏదైనా సమావేశాలుంటేనే హాజరయ్యే పరిస్థితి ఉండడం తమ ఇబ్బందులను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని జనసేన నేతలు వాపోయిన పరిస్థితి కూడా కనిపించింది.. ఈనేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మార్పు జరిగనుందా.. అందుకే నియోజకవర్గంలో ఈరకమైన వార్తలు హల్‌చల్ చేస్తున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి..

# భారత్‌లో పెరుగుతున్న విడాకులు..



న్యూఢిల్లీ, :భారత్‌లో విడాకుల ట్రెండ్ భారీగా పెరుగుతోందని ఓ సర్వేలో వెల్లడైంది. ఇక విడాకులు తీసుకున్న తర్వాత పురుషులు ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభంపై ఈ సర్వే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇక విడాకుల ఖర్చులు, విడాకుల తర్వాత భరణం చెల్లింపుల కోసం 42 శాతం మంది పురుషులు అప్పులు చేస్తున్నారని వెల్లడైంది. అదే సమయంలో పురుషులు సంపాదించే సంపాదనలో ఏటా 38 శాతం సొమ్మును.. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ కింద చెల్లిస్తున్నారని ఈ సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పురుషులపైనే పడుతోందని వెల్లడించిందిమన దేశంలో రోజురోజుకూ విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య అమాంతం పెరిగిపోతుండటం తీవ్ర సంచలనంగా మారుతోంది. అయితే విడాకులు అనేది కేవలం మానసిక వేదన మాత్రమే కాకుండా.. జీవితంలో ఎదురయ్యే అతిపెద్ద ఆర్థిక సంక్షోభం అని తాజాగా నిర్వహించిన ఒక కొత్త అధ్యయనం నిరూపించింది. భారతదేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల్లో విడాకులు తీసుకున్న కొంతమందిపై ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు బయటికి వచ్చాయి. విడాకుల తర్వాత ఒక పురుషుని ఆదాయంలో ఏడాదికి 38 శాతం భరణం , మెయింటెనెన్స్ వంటివి చెల్లించేందుకే ఖర్చు అవుతున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో 42 శాతం మంది వ్యక్తులు.. విడాకుల సమయంలో చెల్లించే భరణం కోసం రుణాలు తీసుకుంటున్నట్లు తేలిందిఫైనాన్స్ మ్యాగజైన్ అనే సంస్థ భారత్‌లోని టైర్ 1, టైర్ 2 వంటి నగరాలకు చెందిన 1,258 మందిపై నిర్వహించిన 2025 సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పూర్తిగా పురుషులపైనే పడుతోందని వెల్లడించింది. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ చెల్లించేందుకు.. పురుషులు తమ వార్షిక ఆదాయంలో సగటున 38 శాతం ఖర్చు చేస్తున్నట్లు ఈ సర్వే వివరించింది. దాదాపు 49 శాతం మంది పురుషులు విడాకులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఇక ఇందులో మరో ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. 42 శాతం మంది పురుషులు భరణం చెల్లింపులు లేదా న్యాయ ప్రక్రియల కోసం రుణాలు తీసుకుంటున్నారని తెలిపింది.భరణం చెల్లించే పురుషుల్లో 29 శాతం మంది సెటిల్‌మెంట్ తర్వాత తమ ఆస్తుల నెట్ వర్త్ ప్రతికూలంగా మారిందని ఈ సర్వేలో వెల్లడించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలాంటి విడాకుల ఖర్చులు ఉంటే.. ఆర్థికంగా చాలా సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతారని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. విడాకులు తీసుకున్న పురుషుల్లో దాదాపు సగం మంది విడాకుల తర్వాత తమపై పడే ఆర్థిక భారాన్ని ముందుగా అంచనా వేయలేకపోతున్నారని ఈ సర్వే పేర్కొంది. కోర్టు ఫీజులు, లాయర్ ఖర్చులు, భరణం, పిల్లల నిర్వహణ ఖర్చులతో ఈ భారం భారీగా పెరుగుతోందని తెలిపింది.ఈ సర్వే పాల్గొన్న ఒక వ్యక్తి తన 7 ఏళ్ల న్యాయ పోరాటానికి సుమారు రూ.8-9 లక్షల వరకు ఖర్చు అయిందని.. దీనివల్ల మానసికంగా, ఆర్థికంగా తాను పూర్తిగా కుంగిపోయానని తెలిపారు. ఇటీవలి కాలంలో విడాకుల సమయంలో భరణం మొత్తాన్ని పెంచుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతున్నాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో మొత్తం విడాకుల రేటు దాదాపు 1 శాతం వద్ద తక్కువగానే ఉన్నప్పటికీ.. బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి పట్టణ ప్రాంతాల్లో గత కొన్నేళ్లలో విడాకుల కేసులు 30 నుంచి 40 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.బాంబే హైకోర్టు, ఫ్యామిలీ కోర్టులో లాయర్ అయిన అదితి మోహోని భార్యాభర్తల జీవితంలో వచ్చే ఆర్థిక నష్టాన్ని నివారించడానికి లేదా దాన్ని తగ్గించడానికి కొన్ని కీలక సూచనలు చేశారు. పెళ్లికి ముందు భార్యాభర్తలు ఇద్దరూ స్పష్టమైన ఆర్థిక నియమాలను ఏర్పరచుకోవాలని.. వాటిని డాక్యుమెంట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదాయాన్ని ఎలా పంచుకోవాలి అనేదానిపై నిర్ణయం తీసుకుని జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉంటే.. వారి పేరు మీద ఆస్తులు లేదా బీమాను సృష్టించాలని తెలిపారువిడాకుల సమయంలో ఆస్తులు, అప్పులు, ఆదాయం, భరణం, పిల్లల పోషణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, రికార్డుల కాపీలను భద్రపరుచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హక్కులను కాపాడుకోవడానికి, సాఫీగా మారడానికి ఫ్యామిలీ లాయర్ లేదా ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఆర్థిక విషయాల్లో భార్యాభర్తలిద్దరూ ముందే ఒక అభిప్రాయానికి వస్తే.. తర్వాత ఎదురయ్యే ఒత్తిడిని నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విడాకులకు సంబంధించిన న్యాయ ప్రక్రియలను ప్రారంభించడానికి ముందే కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇది లీగల్ ఫీజులు, అద్దె, రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

# సినిమా..

## పెద్ది ఫస్ట్ సింగిల్ ఆలస్యానికి కారణం ఏంటి..





ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'గేమ్ ఛేంజర్' సినిమాతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రేక్షకుల ముందుకు వచ్చి, ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఆయన పూర్తి స్థాయిలో తన కొత్త ప్రాజెక్ట్ 'పెద్ది'పై దృష్టి సారించారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, పాన్ ఇండియా లెవల్లో రూపొందుతోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రారంభం నుంచి భారీ అంచనాలున్నాయి. ఈ అంచనాలకు తగ్గట్లుగానే మేకర్స్ ప్రతీ చిన్న అప్‌డేట్‌ను ఎంతో కేర్‌ఫుల్‌గా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ అన్నీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను రాబట్టాయి. ఇక ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నది ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్, ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ అని చెప్పడంలో సందేహమేలేదు. మేకర్స్ ఇప్పటికేఈ విషయాన్నిస్పష్టంగా తెలియజేశారు. మూవీ నుండి విడుదల కానున్న ఫస్ట్ సింగిల్‌పై కూడా భారీ అంచనాలున్నాయి. దసరా సందర్భంగా ఈ పాటను రిలీజ్ చేస్తారని ఊహాగానాలు వెల్లువెత్తాయి. కానీ పాట విడుదల కాలేదు. తాజా సమాచారం ప్రకారం, పెద్ది ఫస్ట్ సింగిల్ పూర్తిగా రెడీగా ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన కొన్ని విజువల్స్‌ను షూట్ చేసి, లిరికల్ వీడియోలో యాడ్ చేసిన తరువాతే విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారట అందుకే దసరాకు పాట విడుదల చేయకుండా ఆ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. ఈ పాట ఒక మంచి లవ్ ట్రాక్ అని, రెహమాన్ దాన్ని ఎంతో ఫ్రెష్‌గా కంపోజ్ చేశారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నదిగా ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, జగపతిబాబు, శివరాజ్‌కుమార్ లాంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అన్ని బలమైన అంశాలతో రూపొందుతున్న 'పెద్ది' సినిమా, 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్న ఈ సినిమా, రామ్ చరణ్‌కు మరొక బ్లాక్‌బస్టర్‌ను తెచ్చిపెడుతుందా అన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్




ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మధనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం



## ప్రభాస్ 'ది రాజాసాబ్' డబ్బింగ్ షురూ.!

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 09న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి డబ్బింగ్ పనులు మొదలుపెట్టింది చిత్రయూనిట్. ఈ విషయాన్ని చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది.

## సినిమా హబ్‌లో మల్టీప్లెక్స్‌ల హడావిడి..




ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా లవర్స్‌కు శుభవార్త. దశాబ్దాలుగా సింగిల్ స్క్రీన్‌లకు కేంద్రమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. ఓడియన్ మల్టీప్లెక్స్ (8 స్క్రీన్‌లు) అక్టోబర్ 24, 2025న.. ఆ తర్వాత సంక్రాంతి 2026కి ఏఎంబీ క్లాసిక్ (7 స్క్రీన్‌లు) ప్రారంభమవుతాయి. మహేష్ బాబు భాగస్వామ్యంతో వస్తున్న ఏఎంబీ క్లాసిక్, సుదర్శన్ థియేటర్ స్థానంలో రూపుదిద్దుకుంది. ఈ కొత్త మల్టీప్లెక్స్‌లతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇక 25 స్క్రీన్‌ల వినోద కేంద్రంగా మారుతుంది.మూవీ లవర్స్ కు ఇది శుభవార్త అనే చెప్పాలి. తెలుగు సినిమాకు ఎప్పుడూ గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా ఎన్నో బాక్సాఫీస్ రికార్డులకు వేదికైన ఈ ప్రాంతంలో.. మొన్నటి వరకు కేవలం పాత తరహా సింగిల్ స్క్రీన్ థియేటర్లు మాత్రమే ఉండేవి.

కానీ.. ఇప్పుడు ఆ సంస్కృతి పూర్తిగా మారిపోతోంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఒకేసారి రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. హైదరాబాద్‌లో సినిమా అంటే గుర్తొచ్చే సంధ్య, దేవి, సుదర్శన్ వంటి ఐకానిక్ థియేటర్లకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సుమారు 18 థియేటర్లు ఉండేవి. వీకెండ్‌లో కొత్త సినిమాల సందడితో ఈ ప్రాంతమంతా కిటకిటలాడేది. ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలకు మల్టీప్లెక్స్ మెరుగులు దిద్దుతున్నారు. 1. ఓడియన్ మల్టీప్లెక్స్ ప్రారంభం: ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఓడియన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ స్థానంలో.. ఇప్పుడు అత్యంత విలాసవంతమైన ఓడియన్ మల్టీప్లెక్స్ రూపుదిద్దుకుంది. సినీ ప్రియుల కోసం తన తలుపులు తెరుస్తుంది. ఇందులో 8 స్క్రీన్‌లు ఉంటాయి. సినిమా చూసే అనుభవాన్ని పెంచడానికి అత్యాధునిక ప్రొజెక్షన్, సౌకర్యవంతమైన లగ్జరీ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. సినిమా హాల్‌తో పాటు, అందులోనే షాపింగ్ మాల్ కూడా ఉంది. దీంతో ప్రజలు ఒకేచోట సినిమాలు చూస్తూ, షాపింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. 2. సంక్రాంతికి ఏఎంబీ క్లాసిక్: ఓడియన్ ప్రారంభమైన వెంటనే.. సంక్రాంతి 2026 సందర్భంగా మరో భారీ మల్టీప్లెక్స్ రాబోతోంది. అదే.. ఏఎంబీ క్లాసిక్. ఇది పాత సుదర్శన్ 70ఓఓ థియేటర్ ఉన్న చోట నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ మహేష్ బాబుకు హైదరాబాద్‌లో ఇది రెండవ మల్టీప్లెక్స్ వెంచర్ కావడం విశేషం. ఏఎంబీ క్లాసిక్‌లో మొత్తం 7 స్క్రీన్‌లు ఉంటాయి. ఈ మల్టీప్లెక్స్‌లో విడుదల కానున్న మొట్టమొదటి పెద్ద సినిమా 'ది రాజా సాబ్' అయ్యే అవకాశం ఉంది. పీవీఆర్, ఐనాక్స్ వంటి పెద్ద కంపెనీల పోటీని ఏఎంబీ క్లాసిక్ ఎలా ఎదుర్కొంటుందో అని సినీ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ రెండు మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని స్క్రీన్‌ల సంఖ్య 18 నుంచి 25కు పెరుగుతుంది. అయితే.. ఈ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకు లు వీటి వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని.. ఇక్కడ భూమి ధరల పెరుగుదల వల్ల అద్దెలు ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఈ మార్పు సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

## నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

**భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వారిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ వివరాల్లోకి వెళితే..**



**హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..:** లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉన్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ, గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హెూయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021-22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021-22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022-23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021-22 14.9 శాతం, 2022-23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ పుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ పుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హెూదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హెూదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హెూదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా..

జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హెూదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215